# ప్రజల నమ్మకం.. పాలకుడి ధైర్యం

## చార్జీల పెంపు నిర్ణయానికి జనామోదం.. సేవల్లో నాణ్యతే ప్రధానం.. భారం మోసేందుకు సిద్ధం





ప్రభుత్వ ఖజానాకు పన్నుల వసూళ్లే ప్రధాన ఆధారం. ఖజానా నిర్వహణపైనే ప్రభుత్వ శక్తి ఆధారపడి ఉంటుంది. అదే సమయంలో ప్రభుత్వ పన్నుల విధానాలు నైతికతపై ఆధారపడి ఉండాలి.

- అర్థశాస్త్రవేత్త కౌటిల్యుడు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ

ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి పన్నుల పెంపు తప్పదని, ఇలాంటి నిర్ణయాల విషయంలో ఓట్ల గురించి భయపడబోమని సీఎం కేసీఆర్ ఏకంగా అసెంబ్లీ వేదికగా ప్రకటించడం సాహసోపేతమైన నిర్ణయంగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వ్యవస్థలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు విద్యుత్ చార్జీలను, మున్సిపల్, గ్రామపంచాయతీల్లో పన్నులను కొంతమేర పెంచక తప్పదని ముఖ్యమంత్రి శుక్రవారం అసెంబ్లీలో ప్రకటించిన సంగతి తెలిసిందే. స్తోమత ఉన్నవారి నుంచే ఎక్కువ పన్నులు వసూలుచేస్తామని, పేదలపై భారం పడకుండా జాగ్రత్త వహిస్తామని కూడా వివరించారు. ఏ ప్రభుత్వమైనా ఇంత సూటిగా, శాసనసభను వేదికగా చేసుకొని మరీ చార్జీలు, పన్నుల పెంపును ప్రకటించడం అత్యంత అరుదని సీనియర్ విశ్లేషకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత పౌర సమాజం నుంచిగానీ, ప్రజల నుంచిగానీ ఇసుమంతైనా వ్యతిరేకత వ్యక్తంకాకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని, ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నిర్ణయాలకు ఉన్న ప్రజామోదాన్ని ఇది సూచిస్తున్నదని ఆయన విశ్లేషించారు. సాధారణంగా పెద్ద మెజారిటీ ప్రభుత్వాలు కూడా పన్నుల పెంపు నిర్ణయాలు తీసుకోవాలనుకున్నప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాయి. రాజకీయంగా జరిగే నష్టాన్ని బేరీజు వేసుకుంటాయి. రాష్ట్ర ప్రయోజనమా? రాజకీయ ప్రయోజనమా? అన్న మీమాంస తలెత్తిన సందర్భంలో రాజకీయ ప్రయోజనంవైపే మొగ్గు చూపుతాయి. ఇక్కడే కేసీఆర్.. తనకు, ఇతర నాయకులకు మధ్య ఉన్న తేడాను చూపిస్తున్నారని ఒక సీనియర్ నాయకుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనమా? రాజకీయ ప్రయోజనమా? అన్న సందర్భంలో కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తున్నారని ఆయన తెలిపారు. తన నిర్ణయాలను ప్రజలు ఆమోదిస్తారని విశ్వాసం ఉండటమే అందుకు కారణమని అభిప్రాయపడ్డారు. 'ప్రజలు కేసీఆర్‌ను నమ్ముతున్నారు. అందుకే ఆయన కఠిన నిర్ణయాలు తీసుకున్నా ఆమోదిస్తున్నారు. తొలుత ఆ నిర్ణయం సరికాదని అనుకున్నవారు కూడా తర్వాత కేసీఆరే కరెక్టని అంగీకరిస్తున్నారు. అనేకసార్లు ఇది రుజువైంది' అని ఆయన వివరించారు. 'సాధారణంగా ఏ సమాజంలోనైనా కొన్ని ప్రెషర్ గ్రూపులుంటాయి. తమ ప్రయోజనాల సాధనకు అవి సంఘటితంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాయి. బలమైన నాయకులు సైతం రాజకీయ ప్రయోజనాల కోసం వాటికి లొంగిపోతుంటారు. అందుకోసం ఇతర పేద, అసంఘటిత, నోరులేని వర్గాల ప్రయోజనాలను పణంగా పెడుతుంటా రు. కానీ విచిత్రంగా కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాల కోసం, పేదలకు అమలుచేసే సంక్షేమ పథకాల అమలుకోసం ప్రెషర్ గ్రూపులతో తలపడుతున్నారు. వాటి ఒత్తిడి ఎత్తుగడలకు లొంగకుండా చిత్తు చేస్తున్నారు. ఇది ఆసక్తికరంగా కనిపిస్తున్నది' అని విశ్లేషించారో కాలమిస్టు. ఆర్టీసీ సమ్మె, పీఆర్సీ, రెవెన్యూ, కొత్త మున్సిపల్ చట్టం తదితర అంశాలను ఆయన ప్రస్తావించారు.

### భారీ ప్రాజెక్టులు, సంక్షేమం జోడెడ్లుగా..

సాధారణంగా దార్శనికత ఉన్న ఏ ప్రభుత్వమైనా రెండు కీలక వ్యూహాల మధ్య సంతులనంతో పనిచేస్తుంది. అందులో ఒకటి స్వల్పకాలికమైనది కాగా, మరొకటి దీర్ఘకాలికమైనది. 'సంక్షేమ పథకాల వంటివి బడుగులకు తక్షణ ఉపశమనాన్ని అందిస్తే, సాగునీటి ప్రాజెక్టుల వంటివి రాష్ట్రానికి దీర్ఘకాలంలో భారీ ప్రయోజనాలను కలిగిస్తాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను, భారీ ప్రాజెక్టులను బండికి జోడెడ్లలా ముందుకు తీసుకుపోతున్నది. తాము చెల్లించే, చెల్లించబోయే పన్నులు సద్వినియోగం అవుతున్నాయని ప్రజలు నమ్ముతున్నారు. పన్నుల రూపంలో తాము ఖజానాకు చెల్లించిన సొమ్ము పక్కదారి పట్టడం లేదని, తిరిగి అది తమకే చెందుతున్నదని విశ్వసిస్తున్నారు. పెన్షన్లు, సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టుల రూపంలో ఇది వారి కండ్లముందే కనిపిస్తున్నది. అందుకే చార్జీలు, పన్నుల పెంపు పట్ల ప్రజల్లో ఏమాత్రం వ్యతిరేకత లేదు' అన్నారు ఒక సామాజిక నిపుణుడు.

### వ్యతిరేకత ఎందుకు లేదంటే!

2000 సంవత్సరంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కరంట్ చార్జీలను పెంచినపుడు వ్యక్తమైన ప్రజా వ్యతిరేకతను, జరిగిన ఆందోళనను, అప్పుడు తెలుగుదేశంలో ముఖ్య నేతగా కొనసాగిన నాయకుడొకరు గుర్తుచేశారు. ఇప్పుడు కేసీఆర్ కరంట్ చార్జీలను పెంచుతామని ప్రకటించినా ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకతా లేదని ఆయన కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. 'ఆరోజు మేం సరఫరా చేసిందే విద్యుత్తు. కోతలు, బ్రేక్‌డౌన్లకు తోడు చార్జీలు కూడా పెంచడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కానీ ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాలకూ 24 గంటల నాణ్యమైన కరంట్ ఇస్తున్నది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు అందిస్తున్నది. ఇండ్లకు కోతల్లేని కరంట్ అందుతున్నది. దీంతో ఇన్వర్టర్ల ఖర్చు తప్పిపోయింది. గృహ వినియోగదారుల్లో గణనీయ సంఖ్యలో రైతులు కూడా ఉన్నారు. వీరంతా తమకు అందుతున్న సౌకర్యానికి ప్రతిఫలంగా కొంత భారం మోయడానికి సిద్ధపడుతున్నారు. వ్యతిరేకత రాకపోవడానికి అసలు కారణం ఇదీ' అని ఆయన విశ్లేషించారు.

### కౌటిల్యుడి బాటలోనే..

పన్నులు చెల్లించాలంటే ప్రజలకు పన్నులు చెల్లించే సామర్థ్యం ఉండాలి. లేదా ప్రభుత్వం వారికి ఆ సామర్థ్యాన్ని కల్పించాలి. 'పన్నుల వ్యవస్థ పండ్ల తోట వంటిది. కసుగాయల్ని కోయడం రైతుకూ నష్టం, పంటకూ నష్టం. పౌరులకు చెల్లించే స్తోమత తెచ్చిన తర్వాతే ప్రభుత్వాలు పన్నులను పెంచాలి' అంటాడు అర్థశాస్త్రవేత్త కౌటిల్యుడు. కేసీఆర్ కూడా ఇదే చేస్తున్నారని ఆర్థిక నిపుణుడొకరు వివరించారు. 'దశాబ్దాల ఉమ్మడి పాలనతో, దశాబ్దానికి పైగా సాగిన ప్రత్యేక ఉద్యమంతో తెలంగాణ నీరసించి ఉన్న తరుణంలో, కేసీఆర్ ముఖ్యమంత్రిగా వచ్చారు. రాష్ట్ర మనుగడపై అనుమానాలు ఉన్న సమయంలో పగ్గాలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో వాస్తవిక పరిస్థితిని గుర్తించి, ప్రజల్లో నమ్మకాన్ని ప్రోదిచేయడం తక్షణ కర్తవ్యంగా భావించారు. మన కాళ్లపై మనం నిలబడగలమని నిరూపించారు. ప్రజల ఆర్థిక శక్తి పెంచారు. ఉద్యోగులకు 43% ఫిట్‌మెంట్ ప్రకటించారు. పేదలకు భారీ ఎత్తున పెన్షన్లు ఇచ్చారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారు. విడిపోతే చిమ్మచీకట్లలో మగ్గుతారు అంటూ శాపనార్థాలు వినవచ్చిన తరుణంలో ఏకంగా అన్నిరంగాలకు 24 గంటల కరంట్ ఇచ్చారు. మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి పథకాల ద్వారా వ్యవసాయానికి సాగునీటిని, 24 గంటల ఉచిత విద్యుత్తును అందుబాటులోకి తెచ్చారు. ఫలితంగా ప్రజల ఆర్థిక స్థితిగతులు కుదుటపడ్డాయి. ఆదాయ మార్గాలు, జీవన నాణ్యత పెరిగాయి. ఫలితంగా పన్నులు చెల్లించే సామర్థ్యం కూడా మెరుగుపడింది. చార్జీల పెంపు పట్ల వ్యతిరేకత వ్యక్తంకాకపోవడానికి ఇదే ప్రధాన కారణం' అని ఆ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం దేశ సగటు కంటే ఎక్కువ ఉండటం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా ఆర్థిక ఒడిదుడుకులు ఎదురవుతున్నా తెలంగాణ స్థిర వృద్ధిని సాధిస్తుండటం కూడా ప్రజలకు ప్రభుత్వ పనితీరుపై నమ్మకం పెంచే అంశాల్లో ఒకటని ఆయన తెలిపారు. 'సరైన మౌలిక వసతులు కల్పిస్తే, మరింత పన్ను చెల్లించేందుకు ప్రజలెప్పుడూ సిద్ధంగానే ఉంటారు. లాజిక్ ఏమిటంటే.. మౌలికవసతులతో ప్రజలు ఎక్కువ సంపాదించుకుంటారు. కొంత ప్రభుత్వానికి చెల్లించడానికి వారికి ఇబ్బంది ఉండదు. ఇది ఇద్దరికీ లాభదాయకం కదా! గతంలో జరుగనిదీ, తెలంగాణలో ఇప్పుడు జరుగుతున్నదీ ఇదే' అని ఆయన విప్పి చెప్పారు. విద్యుత్తు, సాగునీరు, పల్లె, పట్టణ ప్రగతి వంటి అంశాల్లో మౌలిక వసతుల కల్పన కోసం జరుగుతున్న భారీ వ్యయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని, అందులో ఉడతా భక్తిగా తమ వంతు భారం పంచుకోవడానికి సిద్ధపడుతున్నారని, దాని ఫలితమే చార్జీల పెంపునకు ప్రజల ఆమోదమని ఆయన విశ్లేషించారు.




2015-16, 2016-17లో అత్యధికంగా కమర్షియల్, ఇండస్ట్రియల్ రంగాలపైనే స్వల్ప పెంపుదల ఉంది. గృహ వినియోగ క్యాటగిరీలో అత్యధికంగా విద్యుత్‌ను వినియోగించేవారికే అదికూడా నామమాత్రంగా చార్జీలు పెంచారు.




2008-2018 వరకు ప్రాపర్టీ ట్యాక్స్‌ను రివైజ్ చేసిన అర్బన్ లోకల్ బాడీల (యూఎల్బీ) సంఖ్య

### ప్రజల్లో కేసీఆర్‌పై నమ్మకం

గ్రామాలు, మునిసిపాలిటీల్లో చార్జీల పెంపునకు కూడా క్షేత్రస్థాయిలో ఎలాంటి వ్యతిరేకతా లేదని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మండల నాయకుడొకరు అన్నారు. 'తెలంగాణ వచ్చాక ఇప్పటిదాకా పెద్దగా చార్జీలను పెంచలేదు. కేసీఆర్ ఏం చేసినా తమ కోసమే చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉన్నది. అదే రీతిలో కేసీఆర్ కూడా.. ఎమ్మెల్యేల వేతనాలను తగ్గించైనా పల్లెప్రగతికి నిధులు ఇస్తానని ప్రకటించారు. కేంద్రం ఇచ్చే రూ.1847 కోట్లకు సమానంగా మరో 1847 కోట్లను జతచేసి పంచాయతీలకు ఇస్తామని చెప్పారు. ప్రజలు కూడా దాన్ని నమ్ముతున్నారు' అని ఆయన పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు గతంలో కేంద్రం నుంచి (ఫైనాన్స్ కమిషన్) నిధులు సరిగా విడుదలయ్యేవి కాదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచీ అంతే. దీనితో గ్రామపంచాయతీలు ఎప్పుడూ నిధుల కొరతతో సతమతమయ్యేవి. గనులున్న ప్రాంతాల్లో మాత్రమే పంచాయతీలకు కాస్త నిధులు వచ్చేవి. వసూలు చేసిన పన్నులను జీపీ ఖాతాలో జమచేసి సిబ్బంది జీతాలు తీసుకునేవారు. చాలాసార్లు జీతాలకు కూడా ఇబ్బంది పడాల్సివచ్చేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. దీనికి తోడు పల్లెప్రగతి, పట్టణప్రగతి వంటి కార్యక్రమాలు పొరస్పృహను పెంచాయి. ప్రభుత్వం తమ నిధుల్ని తమకోసమే ఖర్చు చేస్తున్నదనే నమ్మకం ప్రజల్లో కుదిరింది' అని ఒక సర్పంచ్ వివరించారు.

---

## ప్రతినెలా పింఛన్లకు రూ.879 కోట్లు

- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్న మహాత్ముడు సీఎం కేసీఆర్ అని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. రాష్ట్రంలో 38,77,717 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారని, పింఛన్లకోసం ప్రతినెలా రూ.879 కోట్లు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. శనివారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు చల్లా ధర్మారెడ్డి, కాలె యాదయ్య, కే చందర్ అడిగిన ప్రశ్నకు ఎర్రబెల్లి సమాధానమిచ్చారు. ఈ నెల తర్వాత వృద్ధాప్య పింఛన్ వయోపరిమితిని 57 ఏండ్లకు తగ్గిస్తామని తెలిపారు. దీనివల్ల మరో 6.62 లక్షల మంది లబ్ధిదారులు పెరుగుతారన్నారు.

## సంస్కరణలతో పెరిగిన ఆదాయం

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సీఎం కేసీఆర్ చేపట్టిన సంస్కరణల ఫలితంగా ఎక్సైజ్‌శాఖకు ఆదాయం పెరిగిందే తప్ప మద్యం దుకాణాలను పెంచడం ద్వారా కాదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. పన్నులను హేతుబద్ధీకరించడం వల్ల ఆదాయం రెండింతలు అయిందన్నారు.

## మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్లు

- మంత్రి గంగుల కమలాకర్



రైతులకు మద్దతు ధర రాలేదని ఒక్కచోట కూడా ఫిర్యాదులు రాలేదని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. వానకాలం పంట కోసం 3,670 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి 47.11 లక్షల టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొన్నామన్నారు. 7,12,344 మంది రైతులకు రూ.8,677 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు.

# కరోనా లేదు.. ఆందోళన వద్దు

- రాష్ట్రంలో ఏ ఒక్కరికీ వ్యాధి సోకలేదు
- మండలిలో మంత్రి ఈటల వెల్లడి
- సీఎం కేసీఆర్‌ను అభినందించిన మండలి చైర్మన్, సభ్యులు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో కరోనావ్యాధి లేనేలేదని, రాష్ట్రంలో ఇంతవరకు ఒక్కరికి కూడా ఆ వైరస్ సోకలేదని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరంలేదని చెప్పారు. వదంతులను నమ్మవద్దని, ఒకవేళ ఎవరికైనా కరోనా సోకినా ఎదుర్కోవడానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని పేర్కొన్నారు. శాసనమండలిలో శనివారం కరోనా వైరస్‌పై కొనసాగిన చర్చ సందర్భంగా పలువురు సభ్యుల ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. దుబాయి నుంచి వచ్చిన ఒకే వ్యక్తికి కరోనా వైరస్ సోకిందని, అతడికి గాంధీ దవాఖానలో చికిత్స అందించామని తెలిపారు. వ్యాధినుంచి పూర్తిగా కోలుకున్న ఆ వ్యక్తి శుక్రవారం సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జి అయ్యాడని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి వ్యాధినివారణకు అనుసరించాల్సిన వ్యూహాన్ని రూపొందించామన్నారు. విదేశాల నుంచి వచ్చేవారి ద్వారా వ్యాధివ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికులను స్కానింగ్ చేస్తున్నామన్నారు.

### సీఎం కేసీఆర్ చర్యలు అభినందనీయం

కరోనా వైరస్‌ను నివారించేందుకు సీఎం కేసీఆర్ తీసుకుంటున్న ముందుజాగ్రత్త చర్యలు అభినందనీయమని శాసనమండలి చైర్మన్ సహా సభ్యులు ప్రశంసించారు. కరోనా అంశంపై జరిగిన చర్చలో సభ్యులు యెగ్గె మల్లేశం, నవీన్‌కుమార్, చిన్నపరెడ్డి, ఆకుల లలిత, ఫారూఖ్‌హుస్సేన్, గంగాధర్‌గౌడ్, ఎంఎస్ ప్రభాకర్, జీవన్‌రెడ్డి, ఎస్ రామచందర్‌రావు, రఘోత్తంరెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి, జాఫ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కరోనా వైరస్ సోకకుండా దవాఖానలను అప్రమత్తం చేయడం, ప్రజలకు అవగాహనలు కల్పించడం వంటి నిర్ణయాలు తీసుకున్న సీఎం కేసీఆర్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

అసెంబ్లీ ఆవాజ్

అసెంబ్లీ సమావేశాలు



### కేసీఆర్ కిట్ గొప్ప పథకం

కేసీఆర్ కిట్ గొప్ప పథకమని, రాష్ట్రంలో దీని ద్వారా ఫిబ్రవరి చివరినాటికి 6,47,823 మంది లబ్ధిపొందారని మంత్రి ఈటల అన్నారు. ఇందుకు రూ.826 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. కేసీఆర్ కిట్ ప్రారంభించిననాటికి ప్రభుత్వ దవాఖానల్లో 30 శాతం ప్రసవాలు జరిగేవని, ఇప్పుడు 51 శాతానికి పెరిగాయని పేర్కొన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఈటల సమాధానమిచ్చారు. ఆడబిడ్డలకు తొలుసూరు కాన్పును ప్రభుత్వమే చేయడం గొప్ప విషయమన్నారు.

## అత్యంత సేఫ్ జోన్‌లో తెలంగాణ

- హోంమంత్రి మహమూద్ అలీ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా పటిష్ఠమైన పోలీసు వ్యవస్థ, నేరాల నియంత్రణ, మహిళలకు భద్రత ఉన్న రాష్ట్రంగా తెలంగాణకు గుర్తింపు వచ్చిందని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో అత్యంత సేఫ్ రాష్ట్రాల్లో మనం ముందున్నామన్నారు. షీటీమ్స్ ఏర్పాటు ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు.

## రైతన్నకు భరోసా

- మంత్రి నిరంజన్‌రెడ్డి



రైతు సంక్షేమానికి అధిక ప్రాధా న్యం ఇస్తున్నామని, జాతీయ సగటును మించి తెలంగాణలో నిధులు కేటాయిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వివరించారు. వ్యవసాయంలో దేశంలోని ఏ రాష్ట్రం కూడా మనతో పోటీ పడేస్థితిలో లేదని చెప్పారు. పండిన పంటలను రైతుకు మద్దతు ధర అందించి కొనుగోలు చేస్తున్నామని, అన్నదాతకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు.

# రాష్ట్రంలో 1200 చెక్‌డ్యాంలు

- రూ.3,825 కోట్లతో నిర్మాణం
- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం రూ.3,825 కోట్లతో 1200 చెక్‌డ్యాంల నిర్మాణానికి ఆమోదం తెలిపిందని ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 600, వచ్చే ఏడాదిలో మిగిలిన వాటి నిర్మాణాన్ని పూర్తిచేస్తామని పేర్కొన్నారు. వీటి నిర్మాణ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని, రానున్న రోజుల్లో అన్ని నియోజకవర్గాల్లో చెక్‌డ్యాంలు నిర్మించి వెచ్చించిన ప్రతిపైసాకు ఫలితం చూపిస్తామని తెలిపారు. శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో చెక్‌డ్యాంల నిర్మాణంపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ చెక్‌డ్యాంల నిర్మాణంతో వాగులు, వంకల్లో సుమారు 15 టీఎంసీల నీటిని నిల్వ చేయొచ్చని, మూడులక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. నదీజలాల్నే కాకుండా వాగు, వంకల్లో నుంచి వచ్చే ప్రతి నీటిబొట్టునూ ఒడిసిపడతామని, అందుకు ప్రభుత్వం సమగ్ర చర్య లు తీసుకుంటుందని హరీశ్‌రావు చెప్పా రు. రాష్ట్రం ఏర్పడ్డాక 146 చెక్‌డ్యాంలు మంజూరుచేశామని, అందులో 53 పూర్తికాగా, మిగిలిన వాటి పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ స్వయంగా రైతు అయినందున వ్యవసాయం, సాగునీటిరంగం లో తీసుకొంటున్న చర్యలతో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువుల పునరుద్ధరణ చేపట్టిందని, వీటితో 15 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరిగిందన్నారు. భారీ, మధ్యతరహా ప్రాజెక్టు కాల్వ ల్లో రూ.471 కోట్లతో 3 వేల తూముల (ఓటీ) నిర్మాణం చేపట్టగా.. అందులో 70 శాతం పను లు పూర్తయినట్టు చెప్పారు.

# జూన్ నుంచి రెండోవిడుత గొర్రెల పంపిణీ

- శాసనసభలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండోవిడుత గొర్రెలను జూన్‌నుంచి పంపిణీ చేయాలని నిర్ణయించినట్టు మంత్రి శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా పలువురు ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గొర్రెల కోసం ఇప్పటికే 28 వేల డీడీలు పెండింగ్‌లో ఉన్నాయని, వీరికే తొలుత జీవాలను పంపిణీ చేస్తామని ప్రకటించారు. వీటికి బీమా సౌకర్యాన్ని వర్తింపజేస్తామనని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరువతో జీవాలకు ప్రత్యేకంగా అంబులెన్స్ ఏర్పాటుచేశారని పేర్కొన్నారు. నష్టాల్లో కూరుకున్న విజయ డెయిరీని లాభాల్లోకి తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, దేవాలయాలు, జాతీయ రహదారులపై ప్రత్యేకంగా విజయ డెయిరీ ఉత్పత్తులను విక్రయించే స్టాళ్లను ఏర్పాటుచేస్తామని వివరించారు. చరిత్రలోనే ప్రప్రథమంగా జీవాలకు గుర్తింపు కార్డులను అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 680 వెటర్నరీ దవాఖానల్లో సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.

# మెచ్యూరిటీలేని రేవంత్‌రెడ్డి

- కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్య
- టీపీసీసీ చీఫ్ కావడానికి తనకూ అర్హతలున్నాయని వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి 111 జీవో విషయంలో మెచ్యూరిటీలేకుండా వ్యవహరించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లి భూముల వ్యవహారంలో అవకతవకలు జరిగుంటే ఆ ఆధారాలు బయటపెడితే సరిపోయేదన్నారు. శనివారం రాజగోపాల్‌రెడ్డి అసెంబ్లీలో విలేకరులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. గోపన్‌పల్లి భూముల విషయంలో మంత్రి కేటీఆర్ ఫార్మ్‌హౌస్ దగ్గర హడావుడి చేయడం రేవంత్‌రెడ్డి తప్పేనని చెప్పారు. ఇలాంటి చిల్లరరాజకీయాలు సరికాదని సూచించారు. రేవంత్‌రెడ్డి తనకు మిత్రుడేకానీ ఇటీవల ఆయన చేసింది మంచి పని కాదన్నారు. పీసీసీ చీఫ్ కావడానికి తనకు అన్ని అర్హతలూ ఉన్నాయని తెలిపారు. పీసీసీ పదవి కోసం కొట్లాడుతామని, డబ్బు ఉండటమే ప్రామాణికం కాదని, అందరినీ కలుపుకొనిపోయే స్వభావం కూడా ఉండాలన్నారు.

### రైతుబంధు సొమ్ము నాలాంటి వాళ్లకెందుకు?

సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు చాలామంచి పథకమని కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశంసించారు. అసెంబ్లీలో శనివారం పద్దులపై చర్చలో ఆయన మాట్లాడుతూ.. రైతుబంధు సొమ్ము తనలాంటి ధనికరైతులకు కాకుండా పేదరైతులకు దక్కాలని చెప్పారు. ప్రసంగంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన కొన్ని వ్యాఖ్యలపై ఇద్దరు మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆయన క్షమాపణ చెప్పారు. ఆ వ్యాఖ్యలను స్పీకర్ రికార్డులనుంచి తొలగించారు.

## భూరికార్డుల ఆన్‌లైన్

- మంత్రి వేముల



రాష్ట్రంలో 4.91 లక్షల ఎకరాల విస్తీర్ణం గల సాదాబైనామాల లావాదేవీలను క్రమబద్ధీకరించామని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాల భూముల రికార్డుల ప్రక్షాళన జరిగిందన్నారు. 33 జిల్లాల్లో కలెక్టర్లు, ఆర్డీవోలు, తాసిల్దార్లు తదితరులు మొత్తం 35 వేలమంది పనిచేస్తున్నారని వివరించారు.

## రవాణా ఆదాయం 3,320 కోట్లు

- మంత్రి పువ్వాడ



2019-20 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరినాటికి రవాణాశాఖకు రూ.3,320 కోట్ల ఆదాయం లభించిందని ఆ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చెప్పారు. తొలుత ఏటా పన్నెండు శాతం వృద్ధి చెందిన ఈ శాఖ ఆధునిక సంస్కరణల కారణంగా తాజాగా 18 శాతం మేర ఆదాయాన్ని ఆర్జించిందని పేర్కొన్నారు.

## దేశ వాటర్ బ్యాంక్‌గా తెలంగాణ

- విప్ బాల్క సుమన్



'వాటర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'గా తెలంగాణ రాష్ట్రం అవతరించిందని స్వయంగా వాటర్‌మాన్ ఆఫ్ ఇండియా అభివర్ణించారని ప్రభు త్వ విప్ బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ రైస్‌బౌల్ ఆఫ్ ఇండియాగా రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. సన్న, చిన్నకారు రైతులకు సముచిత రీతిలో ప్రోత్సహించాలని కోరారు. రెండు లక్షల మంది రైతులు డ్రిప్ ఇరిగేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని గుర్తుచేశారు.

నమస్తే తెలంగాణ
WWW.NTNEWS.COM
జిందగీ
9 | కరీంనగర్ | ఆదివారం 15 మార్చి 2020 /nt.zindagi



# కష్టపడటం నా బాధ్యత

**15 ఏళ్ల సినీ కెరీర్ .. దాదాపు 50 సినిమాలు.. అగ్రకథానాయిక అనుష్క శెట్టి కెరీర్ ఇది. హీరోలకు ఇది మామూలే అయినా హీరోయిన్లకు మాత్రం ఇదొక పెద్ద అచీవ్‌మెంట్. కేవలం గ్లామర్‌డాల్‌గానే పరిమితం కాకుండా కన్నెర్ర చేసిన 'అరుంధతి'లా, కత్తియుద్ధాలు, గుర్రపుస్వారీలతో రౌద్రపరాక్రమాలు చూపిన 'రుద్రమదేవి'లా, యుద్ధభూమిలో 'దేవసేన'లా ఏ పాత్ర చేసినా ఆ పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేసిన అరుదైన నాయిక అనుష్క శెట్టి. శక్తివంతమైన కథానాయిక పాత్రలకు చిరునామాలా మారిన ఈ స్వీటిశెట్టి 'సూపర్'స్టార్‌గా ఎదిగినా ఎన్ని ప్రశంసలు అందుకున్నా ఆమె ఎప్పుడూ 'నిశ్శబ్దం'గానే స్వీకరించింది. పదిహేనేండ్లుగా పలు వైవిధ్యమైన పాత్రలతో, తన అభినయ కౌశలంతో విజయవంతమైన కథానాయికగా కెరీర్ కొనసాగిస్తున్న అనుష్క శెట్టి తన 15 ఏళ్ల సినీ ప్రయాణం విశేషాలను 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా పంచుకున్నారు.**

- **దేవుడిని నమ్ముతారా?**
- గుళ్లకు వెళుతుంటాను. దేవాలయాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం అంటే ఇష్టం. దేవుడిని నమ్ముతాను. అయితే ప్రత్యేకంగా ఏ మతాన్నీ అనుసరించను.

- **హైదరాబాద్‌తో మీకున్న అనుబంధం?**
- హైదరాబాద్ నాకు సొంత ఊరిలా మారిపోయింది. నా మాతృభాష తుళు అయినా తెలుగులోనే ఎక్కువగా మాట్లాడుతాను. 'సూపర్' నుంచి నేటివరకు తెలుగు ప్రేక్షకులు నన్ను ఆదరిస్తూనే ఉన్నారు.

- **తొలిసారి సెట్‌లో అడుగుపెట్టిన రోజు గుర్తుందా?**
- నా జీవితంలో మధురమైన జ్ఞాపకమది. ఆ రోజు ఇప్పటికీ గుర్తుంది. మార్చి 10న తొలిసారి కెమెరా ముందుకు వచ్చాను. మార్చి 12 2005లో అన్నపూర్ణ స్టూడియోలో తొలి సన్నివేశాన్ని నాపై చిత్రీకరించారు.

- **పదిహేనేండ్లు ప్రయాణాన్ని పూర్తిచేసుకోవడం ఎలా అనిపిస్తున్నది?**
- సినీ కెరీర్‌ను మొదలుపెట్టి అర్థం చేసుకునేలోపే చాలా సినిమాలు చేసేశాను. ఇప్పుడు బ్రేక్ తీసుకున్నాను. అందరూ పదిహేను సంవత్సరాలు పూర్తిచేయడం ఓ అచీవ్‌మెంట్ అంటున్నారు. ఈ మాటలు వింటుంటే నాలో ఇంకా బాధ్యత పెరిగింది. మరింత కష్టపడాలనిపిస్తుంది. తెలుగు పరిశ్రమలో చాలామంది విజేతలున్నారు. వాళ్లతో పోల్చుకుంటే నాది పెద్ద విజయమేమీ కాదు.

- **ఈ ప్రయాణం ఎలా అనిపిస్తున్నది?**
- క్షణాల్లో అయిపోయినట్లు ఉంది. పదిహేనేళ్లు ఎలా పూర్తయ్యాయో తెలియలేదు. కాలం వేగంగా గడిచినట్లుంది. ఈ ప్రయాణంలో ప్రతిరోజు షూటింగ్‌లలోనే ఎక్కువగా ఉన్నాను. విరామం తీసుకున్న తర్వాత ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే తల్లిదండ్రులు, సన్నిహితుల వయసు పెరిగినట్లుగా అనిపించింది. అద్భుతమైన ప్రయాణమిది.

- **స్టార్ హీరోయిన్‌గా ఈ స్థాయికి చేరుకుంటారని తొలినాళ్లలో ఎప్పుడైనా ఊహించారా?**
- అస్సలు అనుకోలేదు. ఇండస్ట్రీలోకి రాకముందు సినిమాల్ని పెద్దగా చూసేదాన్ని కాదు. నటీనటులు, స్టార్‌డమ్ అంటే తెలియదు. సినిమాలు చూసుంటే అవన్నీ అవగాహన ఉండేది. ఇండస్ట్రీ గురించి ఎలాంటి పరిజ్ఞానం లేకపోవడంతో తొలినాళ్లలో ప్రతిదీ కొత్తగానే ఉండేది. చిత్రసీమ నుంచి వెళ్లేలోపు ఏదో ఒకటి నేర్చుకోవాలి, కష్టపడాలనే తపనతో వచ్చాను. సినిమాల్లో ఇప్పటివరకు నేను సాధించినవన్నీ బోనస్‌గానే భావిస్తాను.

- **ఈ ప్రయాణంలో కష్టాలు ఎదుర్కొన్నారా?**
- సినీ పరిశ్రమలోనే కాదు ఏ రంగంలోనైనా కష్టాలు ఉంటాయి. అది సహజం. తొలినాళ్లలో నటించడం, డైలాగ్ చెప్పడంలో ఇబ్బందులుంటాయి. ఓ పాత్రను ఎంచుకున్నప్పుడు దానికి న్యాయం చేయగలనా లేదా అనే భయాలుంటాయి. ప్రతి నాలుగైదు నెలలకు కొత్త వ్యక్తులు, టీమ్‌తో పనిచేస్తుంటాం. ఆ తర్వాత మెల్లగా మనకు దగ్గరైన వారు జీవితాంతం వెన్నంటే ఉంటారని అర్థం చేసుకున్నాను.

- **చిత్రసీమలో మీకున్న మంచి స్నేహితులు?**
- సుప్రియ, ప్రశాంతి, నాని, రాజమౌళి, వల్లి, శ్యామ్‌ప్రసాద్ వీరందరినీ నా కుటుంబ సభ్యుల్లా భావిస్తాను. చిత్రసీమలో వారే నాకు అత్యంత సన్నిహితులు. ఇప్పటికీ వారితో చక్కటి అనుబంధం కొనసాగుతూనే ఉన్నది. మంచి సినిమాలతో మంచి వ్యక్తులు దొరకడం బోనస్‌గా భావిస్తాను.



- **సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్ల కెరీర్ సుదీర్ఘ కాలం కొనసాగడం అరుదుగా కనిపిస్తుంటుంది?**
- ప్రస్తుతం ఆ ధోరణిలో మార్పులు కనిపిస్తున్నాయి. ఏ రంగంలోనైనా సుదీర్ఘ కాలం కొనసాగాలంటే కష్టపడేతత్వమే ఉపయోగపడుతుందని నేను విశ్వసిస్తాను. వృత్తితో పాటు అనుబంధాలకు విలువ ఇవ్వడం ముఖ్యం. కొన్ని సార్లు మనం చేసే పని గొప్పది కాకపోయినా నిజాయితీగా శ్రమించాలి. అవకాశాలు రావడం అదృష్టంగానే పరిగణిస్తాను. అయితే కొన్నిసార్లు పరాజయాలు ఎదురవుతాయి. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని జీవితాన్ని కొనసాగించడం చాలా ముఖ్యం.

- **యాభై సినిమాల మైలురాయికి చేరువయ్యారు? మీ కెరీర్‌లో ఎక్కువ చాలెంజింగ్‌గా అనిపించిన సినిమాలేవి?**
- తొలి సినిమా 'సూపర్'లో అవకాశం వచ్చిన సమయంలో కెమెరా ముందు నటించడం, డ్యాన్స్ చేయడం అదే నా జీవితంలో తొలిసారి కావడంతో చాలా భయపడిపోయాను. ఆ తర్వాత నిదానంగా వాటిని అర్థం చేసుకున్నాను. 'అరుంధతి'తో పాటు నా సినీ కెరీర్‌లో ప్రతి సినిమా సవాల్‌గానే నిలిచింది. ప్రతిభావంతులైన మంచి టీమ్‌తో పనిచేయడం వల్లే ఆ చాలెంజెస్‌ను అధిగమించగలిగాను. అరుంధతి, వేదం, రుద్రమదేవి, బాహుబలి ఇలా ప్రతి సినిమాలో తపన కలిగిన దర్శకనిర్మాతలతో పని చేయడం వల్లే వైవిధ్యమైన కథ, పాత్రల్ని పోషించగలిగాను.



- **మీ పెళ్లి గురించి..**
- పెళ్లికి నేను వ్యతిరేకం కాదు. అందుకు టైమ్ రావాలి. సరైన భాగస్వామి దొరకాలి. జీవితంలో అమ్మానాన్నలు ఎంత ముఖ్యమో పెళ్లిచేసుకునే వ్యక్తికి అంతే ప్రాధాన్యం ఉంటుంది. పెళ్లి అనేది ఓ అందమైన భావన. దానిని రహస్యంగా దాచిపెట్టలేం. పెళ్లిచేసుకుంటే అందరికీ తెలిసిపోతుంది. పెళ్లి గురించి రూమర్స్ వచ్చినపుడు పట్టించుకోకుండా వదిలివేస్తాను.

- **హీరోలతో సమానంగా మార్కెట్, ఇమేజ్ రావడం బాధ్యతగా ఫీలవుతున్నారా?**
- నేనెప్పుడూ ఏ విజయాన్ని నా ఒక్కదానికే ఆపాదించుకోను. నా వల్లే సక్సెస్ వచ్చిందని భావించుకోను. సినిమా ఇండస్ట్రీ అనేది 24 విభాగాల సమిష్టి కృషిపై ఆధారపడి ఉంటుంది. అందరూ కలిసి తపనతో పనిచేస్తేనే విజయాల్ని అందుకోగలుగుతాం. నటీనటుల విజయాల వెనుక ఎంతో మంది కష్టం ఉంటుంది. నటులకు ఓ విజయం వరించినప్పుడు ఇతరులతో పోలిస్తే పది మార్కులు ఎక్కువగా వస్తాయి. ఏదైనా తప్పు జరిగితే మిగతా వారి కంటే పది మార్కులు ఎక్కువగా కోల్పోవాల్సి ఉంటుంది.

- **'నిశ్శబ్దం' సినిమాను అంగీకరించడానికి కారణం?**
- హేమంత్ మధుకర్ చక్కటి స్క్రీన్‌ప్లేతో ఈ కథ తయారుచేశారు. కొత్తగా ఉంటుందనే ఆలోచనతో అంగీకరించాను. తొలుత ఈ పాయింట్ విన్నప్పుడు డైలాగ్స్ లేకుండా ఎలా నటించాలో అర్థం కాలేదు. ఎలాగైనా చేయాలనే ఆసక్తిని నాలో రేకెత్తించింది. మూగయువతిగా నటించాలనే ప్లాన్ చేసుకోలేదు. కథలోనే నా పాత్ర అలా ఉండడంతో అలా జరిగిపోయింది.



- **మిమ్మల్ని హీరోయిన్‌గా యాభై కోట్లు ఖర్చుపెట్టి సినిమా తీయొచ్చనే నమ్మకాన్ని ఎలా నిలబెట్టుకోగలిగారు?**
- అరుంధతి, బాహుబలి సినిమాలు నాకంటూ ప్రత్యేకంగా ప్లాట్‌ఫామ్‌ను ఏర్పరిచాయి. నాతో అలాంటి సినిమాలు చేయగలననే నమ్మకాన్ని తీసుకొచ్చాయి. అయితే నా దృష్టిలో కథే అసలైన హీరో. ప్రేక్షకుల్ని ఎమోషన్స్‌తో కనెక్ట్ చేయగలిగే కథలు దర్శకులు రాయకపోతే ఏం చేసినా సినిమాను ముందుకు తీసుకెళ్లలేము. ఏదైనా కథలపైనే ఆధారపడి ఉంటుంది.

- **'బాహుబలి' చిత్రం మీకు ఎలాంటి సంతృప్తిని మిగిల్చింది?**
- నా కెరీర్‌లో అన్ని షేడ్స్ ఉన్నగొప్ప పాత్రను పోషించే అవకాశం రావడం అదృష్టంగా అనిపించింది. యువరాణిగా, తల్లిగా, బందీగా నా పాత్రలో భిన్న పార్శ్వాలుంటాయి. నటనపరంగా, వ్యక్తిగతంగా ప్రతి అంశంలో ఈ సినిమా సంతృప్తిని మిగిల్చింది. అందరం కుటుంబంలా కలిసిపోయి పనిచేశాం. మా కష్టానికి పెద్ద స్థాయిలో విజయం దక్కడంతో కన్నీళ్లు వచ్చాయి. కొన్నిసార్లు అలాంటి అద్భుతాలు జరుగుతాయి.

- **గ్లామర్‌తో పాటు అభినయానికి ప్రాధాన్యమున్న విభిన్నమైన పాత్రల్ని పోషించారు?**
- పూరిజగన్నాథ్, నాగార్జునలకు నాలో ఏదో ప్రతిభ ఉందని నమ్మి అవకాశమిచ్చారు. అలాగే 'విక్రమార్కుడు' సమయంలో నన్ను కలిసిన శ్యామ్ ప్రసాద్ రెడ్డి 'అరుంధతి' సినిమాను నాతో చేయచ్చని నమ్మారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకున్నాను. మనసుపెట్టి నిజాయితీగా శ్రమించాను.



- **'బాహుబలి' మీకు జాతీయ స్థాయిలో గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ సినిమా తర్వాత బాలీవుడ్‌లో అవకాశాలు వచ్చాయా?**
- కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ బ్రేక్ తీసుకోవడం వల్ల ఏ సినిమాను అంగీకరించలేదు. బాలీవుడ్‌లో ప్రత్యేకంగా నటించాలనే కోరిక నాకు లేదు. కథ సంతృప్తినివ్వడమే కాకుండా మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులతో పనిచేశాననే సంతృప్తి ఉండాలి. అది లేకపోతే ఏ భాషలో సినిమా చేయను.



- **స్టార్‌డమ్ వచ్చిన తర్వాత సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటున్నారని అనుకోవచ్చా?**
- మంచి కథలకు ప్రాధాన్యమిస్తున్నాను. ఇదివరకు చేసిన కథ, పాత్రలను పునరావృతం కాకుండా జాగ్రత్తపడుతున్నాను. కంఫర్ట్‌జోన్‌కు పరిమితం కాకుండా ప్రయోగాత్మక కథాంశాలతో సినిమాలు చేయాలి. ప్రతి కథను నటిగా కాకుండా ఓ ప్రేక్షకురాలిగా వింటాను. నేను స్క్రీన్‌పై చూడటానికి ఇష్టపడ్డ కథలతోనే సినిమాలు చేస్తాను.

- **నిశ్శబ్దం సినిమాలో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతున్నది?**
- సంతోషంగా జీవితాన్ని వెళ్లదీసే చిత్రకారిణిగా కనిపిస్తాను. సియాటెల్‌లోని ఓ అనాథాశ్రమంలో పెరిగిన ఆమె జీవితంలో ఎలాంటి మార్పులు వచ్చాయన్నది తెరపై ఆసక్తిని పెంచుతుంది.

- **ఈ మధ్యకాలంలో మీ పెళ్లిపై చాలా వార్తలు వినిపించాయి?**
- వాటిలో చాలావరకు నా వరకు రాలేదు. నేను టీవీ చూడను. వార్తలు చదవను. ఎవరైనా నీ గురించి ఫలానా వార్త వచ్చిందని చెబితేనే నాకు తెలుస్తుంది. ఎందుకు రాస్తారో నాకు తెలియదు. సోషల్‌మీడియాలో నేను లేను. నా అభిమానులే ఓ ఖాతాను కొనసాగిస్తున్నారు. అందులో నా గురించిన పాజిటివ్ వార్తలే పోస్ట్ చేస్తుంటారు. రూమర్స్ వస్తూనే ఉంటాయి. వాటి గురించి ఏం చేయలేము.

- **కెరీర్ పరంగా, వ్యక్తిగతంగా స్వీయ నిర్ణయాలే తీసుకుంటారా? ఎవరి సలహాలైన స్వీకరిస్తుంటారా?**
- ఏదైనా సొంత నిర్ణయాలనే ఫాలో అవుతుంటాను. ఏదైనా కథ బాగుంటే దాని గురించి నా స్నేహితులతో పంచుకుంటాను. కానీ ఆ సినిమా చేయాలా వద్దా అన్నది మాత్రం నా నిర్ణయానికే కట్టుబడి ఉంటాను.

- **పాత్రల కోసం బరువు పెరగడం, తగ్గడం సులభమని అనుకుంటున్నారా?**
- అలాంటి పాత్రల వల్ల ఆరోగ్యం పాడైపోతుంది. 'సైజ్‌జీరో' సినిమా చేస్తున్నప్పుడు భవిష్యత్ పరిణామాలు ఊహించలేదు. కథ ఎగ్జైటింగ్‌గా అనిపించడంతో నటించాను. ఆర్యోగాన్ని గురించి ఆలోచించుకోవడం ముఖ్యమని అర్థమైంది. యోగ నా జీవితంలో ఓ భాగం. ఇప్పటికీ యోగ, మెడిటేషన్ రోజూ చేస్తూనే ఉంటాను.

- **సినిమాలు కాకుండా మీకు ఇష్టమైన వ్యాపకమేది?**
- ట్రావెలింగ్‌కు ప్రాముఖ్యమిస్తాను. సంగీతం వింటాను. విరామం దొరికితే సన్నిహితులకు సమయాన్ని కేటాయిస్తాను. కొన్ని సార్లు ఏం చేయకుండా ఖాళీగా ఉంటాను. ఏదైనా కొత్తగా నేర్చుకుంటాను.

- **మీ దగ్గర పనిచేసేవారి బాగోగుల్ని దగ్గరుండి చూసుకుంటారట?**
- అది మన వ్యక్తిత్వంపైన ఆధారపడి ఉంటుంది. ఇప్పటికీ నా స్కూల్ ఫ్రెండ్స్, యోగ స్నేహితులతో ఒకప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉంటాను. ఆ రిలేషన్‌షిప్‌లను అలాగే కొనసాగించడం ముఖ్యం. ఎవరికైనా విలువ ఇవ్వడమే నాకుండా ఆ అనుబంధాన్ని కొనసాగిస్తాను. కమిట్‌మెంట్ ఉందని సినిమా చేయడం ముఖ్యం కాదు. నటీనటుల అసలైన కమిట్‌మెంట్ ప్రేక్షకులతోనే ఉంటుంది. కథలను నమ్మి హార్డ్‌వర్క్ చేయడం ముఖ్యం. దానినో బాధ్యతగా భావిస్తాను.

- **నటన పట్ల బోర్‌గా ఫీలయిన క్షణాలు ఉన్నాయా?**
- సినిమాలు ఎప్పుడూ బోర్ కొట్టలేదు. 'సైరా' షూటింగ్ సమయంలో మొదటిసారి కారావ్యాన్ మిస్ అయ్యాను. అది తప్ప మిగతా సమయమంతా కారావ్యాన్‌లోనే ఎక్కువగా గడిచిపోయింది. షూటింగ్‌లో ఎప్పుడూ ఏదో మ్యాజిక్ ఉంటుంది. లైట్‌బాయ్ నుంచి ప్రతి ఒక్కరూ కష్టపడుతూనే ఉంటారు. సెట్స్‌లో ఉంటే సమయం తెలియదు. మంచి, చెడు, కష్టనష్టాలు అన్నింటినీ దాటుకుంటూ ఈ స్థాయికి చేరుకునే క్రమంలో వ్యక్తిగతంగా చాలా నేర్చుకున్నాను.

... మడూరి మధు
సిఎం. ప్రవీణ్



## నేను చేశాను మీరూ చేయండి

టాలీవుడ్ నాయికలు నటనతోపాటు అప్పుడప్పుడు సామాజిక సేవా కార్యక్రమాలతో తమ గొప్ప మనసు చూపిస్తూ ఉంటారు. ఇప్పుడు ఈ వరుసలోకి రాశీ ఖన్నా కూడా వచ్చి చేరింది. ఆమె కూడా ఎక్కువగా సామాజిక కార్యక్రమాలలో భాగం అవుతూ ఉంటుంది. తాజాగా ఈ భామ ఓ ప్రైవేట్ కంటి హాస్పిటల్ ప్రారంభోత్సవంలో పాల్గొంది. ఈ సందర్భంగా మరో మంచి పని చేసింది. నేత్రదానం ప్రాధాన్యం అందరికీ తెలియజేసే విధంగా తాను కూడా కూడా నేత్రదానం చేయడానికి ముందుకొచ్చింది. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా తెలియజేసింది. 'నేను నా కళ్ళు దానం చేశాను, మరి మీరు కూడా చేస్తారా?' అంటూ అవగాహన పెంచే విధంగా పోస్ట్ పెట్టింది. దీనిపై నెటిజన్లు ఆమెని ప్రశంసిస్తూ కామెంట్స్ పెట్టారు. 'మీలాంటి వారు ఇలా ముందుకొచ్చి నేత్రదానంపై అవగాహన పెంచితే చాలా మంది ప్రజలు కూడా నేత్రదానం చేయడానికి ముందుకొస్తారు' అంటూ కామెంట్లు పెట్టారు.



## భలే.. బొట్టుమాల

వసంతహారాలు, కాసుల పేరు.. ఇలా రకరకాల హారాలను విన్నారు, వేసుకున్నారు. కానీ ఇప్పుడు మన సంప్రదాయ బొట్టును ప్రేరణగా తీసుకొని బంగారు హారాలను రూపొందించారు. ఈ నయా జమానాలో వీటికి వజ్రాలు, కెంపులను పొందుపరిచి మరీ ఈ హారాలను తయారుచేస్తున్నారు. ఈ బొట్టులో పువ్వులు, నెమళ్లను పొందుపరిచి ముత్యాలను జతచేసి ముచ్చటపడుతున్నారు. లంగా-ఓణీ, చీరల మీదకు ఈ నగ పర్‌ఫెక్ట్‌గా ఉంటుంది. బంగారంలోనే కాదు.. వన్‌గ్రామ్ గోల్డ్‌లోనూ ఈ నగలు మనకు దర్శనమిస్తున్నాయి. కాబట్టి వీటిలో అనేక రకాల డిజైన్స్ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.



## మొటిమలు వేధిస్తున్నాయా?

**నెలసరికంటే ముందుగానే కొన్ని సంకేతాలు హెచ్చరిస్తాయి. అవే మొటిమలు. వీటిని మొదట్లోనే పరిష్కరించేందుకు కొన్ని చిట్కాలు.**

- ముఖం అందంగా కనిపించేందుకు మార్కెట్లో దొరికే ప్రొడక్ట్స్ అన్నీ వాడుతుంటారు. ముందుగా జిడ్డు ప్రొడక్ట్స్ అయిన సన్‌స్క్రీన్స్, కాస్మొటిక్స్, ఆయిల్స్, కాన్సెలర్స్‌ని పక్కన పెట్టండి.
- భద్రత కోసం వాడే హెల్మెట్, స్ట్రాప్స్, బిగుతుగా ఉండే కాలర్స్ నుంచి చర్మాన్ని కాపాడుకోవాలి.
- చర్మంపై యూవీ కిరణాలు పడకుండా జాగ్రత్త తీసుకోండి. వేసవిలో బయటి పనులు కాస్త తగ్గించుకుంటే మంచిది.
- బయట ఎక్కడికి వెళ్లినా ఇంటికి రాగానే ముఖం శుభ్రంగా కడుగాలి. ఇంట్లోనే వ్యాయామాలు, వాకింగ్ చేయండి.

## కరోనా బాధితుల కోసం..



కరోనా వైరస్ వ్యాప్తి భారతదేశాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నది. ప్రతిరోజూ కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే 80 మందికి పైగా వైరస్ బారిన పడ్డారు. వైరస్ కారణంగా మరణించిన వారు ఢిల్లీ, కర్ణాటకకు చెందిన వారే. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధామూర్తి ప్రతిపాదించారు. కర్ణాటక ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. అందులో 'ఒక హాస్పిటల్‌ను ఖాళీ చేసి, కోవిడ్-19 పాజిటివ్ రోగుల చికిత్స కోసం అంకితం చేయాలి. కనీసం 500-700 పడకలు ఉండేలా ఏర్పాటు చేయాలి. దీనికి ఆక్సీజన్ లైన్లు, పైపులు సమకూర్చాలని అభ్యర్థిస్తున్నాను' అని ప్రభుత్వాన్ని కోరింది. ఈ వ్యాధి మరింత వ్యాప్తి చెందితే ప్రైవేట్ హాస్పిటల్స్ కేసులను నిర్వహించడం కష్టమవుతుంది. అన్ని పాఠశాలలు, కళాశాలలు, మాల్స్, థియేటర్లు అన్ని ఎయిర్ కండిషన్డ్ ప్రాంతాలను మూసివేయాలి. ఫార్మసీ, కిరాణా దుకాణాలు వంటి అవసరమైన వాటిని తెరిచి ఉంచాలని సుధామూర్తి లేఖలో కోరారు. ఆమె కోరికకు స్పందించిన డాక్టర్లు కొంతమంది సుధాకు సెల్యూట్ కొడుతూ బాధితులకు ఆశ్రయం కల్పించడానికి ముందుకు వస్తున్నారు.


ఎన్టీఆర్

# రజనీకాంత్ తర్వాత...

దక్షిణాదిలో అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయకుడు ఎవరంటే 'సూపర్‌స్టార్ రజనీకాంత్' అంటూ ఠక్కున సమాధానం చెబుతారు. ఇప్పుడు తమిళ అగ్ర కథానాయకుల్లో ఒకరైన విజయ్..రజనీకాంత్‌కు చేరువలో వచ్చేశాడు. వివరాల్లోకి వెళితే...ప్రస్తుతం విజయ్ కథానాయకుడిగా తమిళంలో 'మాస్టర్' చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాకు విజయ్ దాదాపు 90కోట్ల రెమ్యునరేషన్ అందుకున్నాడని సమాచారం. విజయ్ నటించిన గత చిత్రం 'బిగిల్' (తెలుగులో 'విజిల్') భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాకు విజయ్ 60కోట్లకుపైగా పారితోషికం తీసుకున్నారట. ఈ చిత్ర అఖండ విజయంతో పాటు తిరుగులేని విజయ్ స్టార్‌డమ్‌ను దృష్టిలో పెట్టుకొని భారీ పారితోషికం ఇవ్వడానికి 'మాస్టర్' నిర్మాతలు ముందుకొచ్చారట. 'దర్బార్' చిత్రానికి రజనీకాంత్ వందకోట్ల వరకు పారితోషికం తీసుకున్నారు. అయితే సినిమా ఘోరపరాజయంతో ఆయన రెమ్యునరేషన్‌లో కొంత మొత్తాన్ని తిరిగి నిర్మాతలకు చెల్లించాడని తెలిసింది. తాజాగా 90కోట్ల రెమ్యునరేషన్‌తో విజయ్ తమిళ చిత్రసీమలో అత్యధిక పారితోషికం అందుకుంటున్న రెండో కథానాయకుడిగా నిలవడం విశేషం. 'మాస్టర్' చిత్రానికి లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మాళవికా మోహనన్, విజయ్ సేతుపతి కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. ఏప్రిల్ 9న విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.


విజయ్


కాజల్ అగర్వాల్

# చిరుతో వన్స్‌మోర్

మెగాస్టార్‌తో జోడీగా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది వెండితెర చందమామ కాజల్‌అగర్వాల్. చిరంజీవి కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో 'ఆచార్య' చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇందులో తొలుత త్రిషను కథానాయికగా ఎంపిక చేశారు. అయితే సృజనాత్మక విభేదాల కారణంగా తాను ఈ సినిమా నుంచి తప్పుకుంటున్నట్లు త్రిష సోషల్‌మీడియా ద్వారా వెల్లడించింది. దీంతో చిరు సినిమాలో కథానాయికగా ఎవరిని తీసుకోబోతున్నారనే చర్చ మొదలైంది. త్రిష స్థానాన్ని కాజల్ అగర్వాల్ భర్తీ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో చిరంజీవి సరసన 'ఖైదీ నంబర్ 150' చిత్రంలో నటించింది కాజల్. ఈ ఇద్దరి జోడీ అభిమానుల్ని మెప్పించింది. దాంతో తాజా సినిమాలో కాజల్‌ను నాయికగా తీసుకోవాలని చిత్రబృందం భావిస్తున్నదట. అయితే ఈ విషయంపై ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. 'ఆచార్య' చిత్రాన్ని రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. అవినీతిపై పోరాటం చేసే వ్యక్తిగా ఇందులో చిరంజీవి కనిపించబోతున్నారని సమాచారం.

# తెలంగాణ యాసలో.. మూడు గెటప్స్‌లో

ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రం 'ఆర్‌ఆర్‌ఆర్'. ఈ సినిమాలో తొలితరం స్వాతంత్ర్య సమరయోధులు కొమరం భీం, అల్లూరి సీతారామరాజు పాత్రల్లో ఎన్టీఆర్, రామ్‌చరణ్ నటిస్తున్నారు. ఆ పోరాట యోధుల చారిత్రక ఇతివృత్తానికి కాల్పనిక అంశాల్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఆలియాభట్, ఒలీవియా మోరిస్ కథానాయికలు. నిర్మాణం నుంచే దేశవ్యాప్తంగా సినీ ప్రియుల్లో ఈ సినిమా ఉత్సుకతను రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికరమైన వార్తొకటి ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొడుతోంది. అదేమిటంటే...ఈ సినిమాలో ఎన్టీఆర్ మూడు గెటప్పుల్లో దర్శనమిస్తాడట. అందులో కథానుగుణంగా కొమరం భీం పాత్ర ఒకటి కాగా..మిగతా రెండు గెటప్స్ ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. మూడు గెటప్స్‌లో ఎన్టీఆర్ వైవిధ్యంగా కనిపిస్తారని, సినిమాలో అవి సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్‌గా ఉంటాయని చెబుతున్నారు. మరో విషయమేమిటంటే.. ఈ చిత్రంలో ఎన్టీఆర్ తెలంగాణ యాసలో మాట్లాడుతారట. ఆయన సంభాషణలు హైలైట్‌గా నిలుస్తాయని అంటున్నారు. ఈ చిత్రంలో అజయ్‌దేవ్‌గణ్, సముద్రఖని ముఖ్యపాత్రల్ని పోషిస్తున్నారు. కీరవాణి సంగీతాన్నందిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరిలో సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# క్రీడా నేపథ్యంలో..

'పెళ్లిచూపులు' 'ఈ నగరానికి ఏమైంది' చిత్రాల ద్వారా ప్రతిభావంతుడైన యువ దర్శకుడిగా ప్రశంసలందుకున్నారు తరుణ్‌భాస్కర్. 'మీకు మాత్రమే చెప్తా' 'ఫలక్‌నుమా దాస్' చిత్రాల్లో నటుడిగా కూడా రాణించారు. ప్రస్తుతం ఆయన వెంకటేష్ కథానాయకుడిగా ఓ సినిమాను రూపొందించే సన్నాహాల్లో ఉన్నారు. క్రీడానేపథ్య కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమా గురించి తరుణ్‌భాస్కర్ మాట్లాడుతూ 'స్క్రిప్ట్ పనులు పూర్తయ్యాయి. వెంకటేష్‌గారు ప్రస్తుతం 'నారప్ప' చిత్రీకరణలో ఉన్నారు. అది పూర్తయిన తర్వాత షూటింగ్ మొదలుపెడతాం. స్పోర్ట్స్‌బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఎమోషనల్ డ్రామా ఇది. దీంతో పాటు నెట్‌ఫ్లిక్స్ కోసం తెలుగులో ఓ వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించాను. అద్భుతంగా వచ్చింది. ఇందులో మంచు లక్ష్మి కీలక పాత్రను పోషించారు. ఈ సిరీస్ ద్వారా మేఘనా శాన్వి అనే కొత్త అమ్మాయిని పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు.


తరుణ్‌భాస్కర్

# అచ్చం అమ్మలాగే!


నైసా దేవ్‌గణ్

పక్క ఫొటోలో చిరునవ్వులు చిందిస్తున్న నవ యవ్వన సోయగం ఎవరో కాదు...బాలీవుడ్ సీనియర్ కథానాయిక కాజోల్ తనయ నైసా దేవ్‌గణ్. తన ముద్దుల కుమార్తె తాజా ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది కాజోల్. వీటిని చూసిన అభిమానులు నైసా అచ్చం అమ్మలాగా ఉందంటూ మెచ్చుకుంటున్నారు. 'చారడేసి కళ్లు...ఆ కళ్లలో మెరుపు చూస్తుంటే కాజోల్ ట్రూ కాపీలా ఉంది' అని ఒకరంటే...'మీకు కాపీ పేస్ట్‌లా ఉంది...ఆ నవ్వు సేమ్ టూ సేమ్..రెండో కాజోల్ వచ్చింది' అంటూ మరో అభిమాని చమత్కరించాడు. వందల సంఖ్యలో వస్తోన్న అభిమానుల ప్రశంసలతో కాజోల్ ఆనందానికి అంతులేకుండా పోయింది. నాతో పాటు నా కుటుంబంపై ప్రేమను కురిపిస్తున్న అభిమానులకు సదా కృతజ్ఞురాలినంటూ కాజోల్ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం సోషల్‌మీడియాలో నైసా దేవ్‌గణ్ ఫొటోలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# దేవుడి సమాధానం కోసం


శ్రీనివాస్, మహేంద్రన్ తదితరులు

మహేంద్రన్, శ్రీపల్లవి, కారుణ్యచౌదరి, కరోన్యకత్రిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అసలు ఏం జరిగిందంటే'. శ్రీనివాస్ బండారి దర్శకుడు. అనిల్ బొద్దిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 20న విడుదలకానుంది. బుధవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను చిత్రబృందం విడుదలచేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'మనిషి జీవితంలో జరిగిపోయింది తప్ప జరగబోయేది ఎవరూ ఊహించలేరు. ఆ ప్రశ్నకు సమాధానం దేవుడే చెప్పాలనే పాయింట్‌తో రూపొందిన చిత్రమిది. కాలంతో పరిగెత్తాల్సిన అవసరం కొందరు యువతీయువకులకు ఎందుకొచ్చిందన్నది ఆకట్టుకుంటుంది. అశ్లీలతకు తావు లేకుండా కుటుంబమంతా కలిసి చూసేలా ఉంటుంది. సెన్సార్ పూర్తయింది. క్లీన్ 'యు' సర్టిఫికెట్ లభించింది' అని చెప్పారు. ఇటీవల విడుదలైన పాటలు, ప్రచార చిత్రాలకు చక్కటి ఆదరణ లభిస్తున్నదని నిర్మాత చెప్పారు. కథను నమ్మి తాను చేస్తున్న చిత్రమిదని హీరో మహేంద్రన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్ తటవర్తి తదితరులు పాల్గొన్నారు.


అనుష్కశర్మ

# తోటబావి రహస్యం

బుల్లితెర వ్యాఖ్యాత రవి హీరోగా మారిన విషయం తెలిసిందే. రవి హీరో గా నటిస్తున్న నూతన చిత్రం 'తోటబావి'. గౌతమి నాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి అంజి దేవండ్ల దర్శకుడు. అలూర్ ప్రకాష్‌గౌడ్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ ఇటీవల విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు విజన్ ఈ చిత్రంలో కనిపిస్తుంది. రవికి హీరోగా ఈ చిత్రం మంచి పేరును తీసుకొస్తుందనే నమ్మకం ఉంది'అన్నారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా అన్ని వర్గాలను అలరిస్తుందనే నమ్మకం వుందని దర్శక, నిర్మాతలు తెలిపారు. శివశంకర్ మాస్టర్, ఛత్రపతి శేఖర్, నర్సింహా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతలు: దౌలు, చిన్నస్వామి, అభినేష్.


ప్రకాష్‌గౌడ్, అంజి, శంకర్, గౌతమి

# బాధ్యత పెరిగింది

బాలీవుడ్‌లో ప్రతిభావంతులైన నాయికల్లో అనుష్కశర్మ ఒకరు. కేవలం అభినయపరంగానే కాకుండా చక్కటి అభిరుచితో సినిమాలు తీస్తూ నిర్మాతగా కూడా పేరు తెచ్చుకుంది. ఆమె నిర్మించిన 'ఎన్.హెచ్10' 'ఫిల్లౌరి' 'పారి' వంటి చిత్రాలు విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకున్నాయి. నిర్మాతగా తొలి ప్రయత్నంగా స్వీయ నిర్మాణ సంస్థ క్లీన్‌స్లేట్ ఫిల్మ్స్ పతాకంపై తెరకెక్కించిన 'ఎన్.హెచ్10' చిత్రం ఐదు వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అనుష్కశర్మ మాట్లాడుతూ 'కేవలం 25ఏళ్ల వయసులోనే నేను నిర్మాతగా అదృష్టాన్ని పరీక్షించుకున్నా. సినిమా నిర్మాణం అనగానే తొలుత చాలా మంది వారించారు. అనవసరంగా కెరీర్‌ను పాడు చేసుకోవద్దని సూచించారు. అయితే మునుపెన్నడూ చూడని కొత్త కథల్ని, వాస్తవికత, సహజత్వం కలబోసిన ఇతివృత్తాల్ని ప్రేక్షకులకు అందించాలన్నది నా సంకల్పం. అందుకే నిర్మాతగా ముందుకొచ్చా. తొలి సినిమాతోనే నా ప్రయత్నం ఫలించింది. ఆ తర్వాత చేసిన సినిమాలు విశ్వాసాన్ని పెంచాయి. ఇప్పుడు నిర్మాతగా నాపై మరింత బాధ్యత పెరిగింది. మహిళా సాధికారత, స్ఫూర్తివంతమైన యథార్థ గాథలతో మా సంస్థలో సినిమాలు చేయబోతున్నాం. సినిమా కళ ద్వారా సృజనాత్మకమైన సంతృప్తితో పాటు సమాజానికి మంచి సందేశం అందించాలన్నదే నిర్మాతగా నా ప్రయత్నం' అని చెప్పింది.

# 'బాక్సర్'లో ఉపేంద్ర?

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'బాక్సర్'. కిరణ్ కొర్రపాటి దర్శకుడు. ఇటీవలే వైజాగ్‌లో ఓ షెడ్యూల్ పూర్తయింది. త్వరలో రెండో షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో మొదలుపెట్టబోతున్నారు. యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో వరుణ్‌తేజ్ బాక్సర్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఆయన పాత్ర చిత్రణ నవ్యపంథాలో ఉంటుందని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో కన్నడ సీనియర్ హీరో ఉపేంద్ర కీలక పాత్రలో నటించబోతున్నారని తెలిసింది. కథానుగుణంగా ఆయన పాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని సమాచారం. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రంలో ఉపేంద్ర ప్రధాన పాత్రలో నటించిన విషయం తెలిసిందే. సిద్ధు, అల్లు వెంకటేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తమన్ సంగీతాన్నందిస్తున్నారు.



# అంగుళీక సూర్యగ్రహణ రహస్యం

'సూర్యభగవానుడి అంశలో పుట్టిన అంగుళీక అనే అమ్మాయి కథ ఇది. ఆరువందల ఏళ్ల క్రితం జరిగిన సంఘటనను ఆధారం చేసుకొని సినిమా తీశాం' అన్నారు ప్రేమ్ ఆర్యన్. ఆయన దర్శకత్వం వహిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'అంగుళీక'. దీపక్, శేఖర్‌వర్మ, వివ్యశాన్త్ నాయకానాయికలుగా నటించారు. కోటి తూముల, ఏ.జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాతలు. ఈ నెల 20న విడుదలకానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఆరువందల ఏళ్లకొకసారి వచ్చే అంగుళీక సూర్యగ్రహణం ఈ ఏడాది రాబోతుండటం విశేషం. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా అలరిస్తుంది' అన్నారు. 'సూర్యభగవానుడి అంశలో పుట్టిన ఓ అమ్మాయికి, అంగుళీక సూర్యగ్రహణానికి ఒక లింక్ ఉంటుంది. అదేమిటన్నదే చిత్ర కథ' అని నిర్మాతలు తెలిపారు. వినూత్న కథా చిత్రంలో భాగమవడం ఆనందంగా ఉందని నాయకానాయికలు ఆనందం వ్యక్తం చేశారు. శేఖర్‌వర్మ, కోటిశ్వరరావు తదితరు లు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: చిట్టిబాబు, సంగీతం: శ్యామ్ కె ప్రసన్, మాటలు: బి.సుదర్శన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ప్రేమ్ ఆర్యన్.


వివ్యశాన్త్

## శరభ.. శరభ



ఎములాడ రాజన్న సన్నిధి జంగమయ్య శరభ గద్యాలతో మార్మోగింది. శివ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రుద్రయాగాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు శ్రీ రాజరాజేశ్వరస్వామి, పార్వతీదేవిని, శ్రీ లక్ష్మీసమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులను రథంపై పురవీధుల గుండా ఊరేగించగా, భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు. - వేములవాడ కల్చరల్

## రైలు బడి..



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి ఉపాధ్యాయులు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం ఊటూరు ప్రాథమిక పాఠశాల భవనాన్ని పెయింట్ వేసి రైలుబండిలా తీర్చిదిద్దారు. తరగతి గదిలోకి వచ్చేటప్పుడు రైలు బోగిలో ఎక్కినట్టు, క్లాస్ రూంలో ఉంటే రైలులో కూర్చున్న అనుభూతి కలుగుతుందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

-మానకొండూర్

## గుప్తనిధుల కోసం తవ్వకాలు!

**తిరుమలగిరి, నమస్తేతెలంగాణ:** సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం బండ్లపల్లి సమీపంలోని గుట్ట పక్కన కుంటలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. పసుపు, కుంకుమ, కొబ్బరికాయ, నిమ్మకాయలతో పూజలు చేసిన ఆనవాళ్లుండటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. తవ్వకాలు జరిపిన ప్రదేశం పక్కనే గోతిలో పశువును పూడ్చిపెట్టిన ఆనవాలు కనిపించడంతో కొద్దిరోజుల క్రితం జంతుబలి జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ ఎలాంటి ఆలయం లేకపోవడంతో తవ్వకాలు గుప్తనిధుల కోసమా లేదా క్షుద్రపూజల కోసమో జరిగి ఉంటాయని స్థానికులు అనుమానిస్తున్నారు.





స్మార్ట్ రోడ్డు నమూన

# వరంగల్ తూర్పులో 9 స్మార్ట్‌రోడ్లు

- దశాబ్దాలనాటి రోడ్లకు మహర్దశ
- రెండు రోజుల్లో పనులు ప్రారంభం

**వరంగల్, నమస్తేతెలంగాణ:** కాకతీయ వారసత్వ సంపద ఆనవాళ్లు అడుగడుగునా కనిపించే వరంగల్ తూర్పు నియోజకవర్గంలో తొమ్మిది స్మార్ట్ రోడ్లను నిర్మించనున్నారు. నిజాంకాలం నాటి రోడ్లతో ఇక్కడి పరిస్థితి అధ్వానంగా మారింది. చారిత్రక నగరం స్మార్ట్‌సిటీగా ఎంపికైన తరుణంలో అప్పుడు మేయర్‌గా ఉన్న ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రత్యేక శ్రద్ధతో స్మార్ట్‌సిటీ మొదటి ప్యాకేజీలో ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. దీంతో పాతకాలం నాటి రోడ్లకు ఇప్పుడు మహర్దశ పట్టనున్నది. రూ.52.69 కోట్లతో తొమ్మిది ప్రధాన రహదారులను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు. రెండు రోజుల్లో పనులను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రోడ్లపై ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్, పాదచారులకు ఫుట్‌పాత్‌లు, లైటింగ్, పోర్టబుల్ టాయ్‌లెట్లు, వాటర్ ఏటీఎంలు ఏర్పాటు కానున్నాయి.

### అన్ని విధాలా అభివృద్ధి



సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీర్వాదంతో వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నా. ఇక్కడి అన్ని ప్రధాన రహదారులను స్మార్ట్‌రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించాం. రెండుమూడు రోజుల్లో పనులను ప్రారంభిస్తాం. పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం.

– నన్నపునేని నరేందర్, తూర్పు ఎమ్మెల్యే

# 'అన్నపూర్ణ'లో మరో మోటర్

## యూనిట్-4 ట్రయల్ రన్ విజయవంతం

- నేడు మరో మోటర్ పరీక్షకు కసరత్తు
- రిజర్వాయర్‌లో 0.3 టీఎంసీల నీరు నిల్వ



అన్నపూర్ణ పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి జలాలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టులోని నాలుగో లింకులో నీటివిడుదల కొనసాగుతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ పంప్‌హౌజ్‌లో ఈనెల 11న మొదటి మోటర్ ట్రయల్‌రన్ విజయవంతం చేసిన అధికారులు.. తాజాగా మరో మోటర్‌ను దిగ్విజయంగా ప్రారంభించారు. శనివారం ఉదయం 6.20 గంటలకు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ హరిరాం, ఎత్తిపోతల పథకాల సలహాదారు పెంటారెడ్డి, ఇతర ఇంజినీర్లు అన్నపూర్ణ పంప్‌హౌజ్‌లో మరో మోటరు (యూనిట్-4)కు ట్రయల్‌రన్ నిర్వహించారు. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ నుంచి అన్నపూర్ణ జలాశయానికి కాళేశ్వర జలాల్ని తరలించేందుకు అన్నపూర్ణ పంప్‌హౌజ్‌లో నాలుగు మోటర్లను అమర్చారు. 106 మెగావాట్ల సామర్థ్యమున్న ఒక్కో మోటరు ద్వారా 2,836 క్యూసెక్కుల చొప్పున మొత్తం 11,347 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోయవచ్చు. శనివారం పంప్‌హౌజ్‌లోని యూనిట్-4లోని మోటర్ ట్రయల్‌రన్ నిర్వహించారు. ఇది కూడా విజయవంతం కావడంతో ఆదివారం సాయంత్రం మరో మోటర్ ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. 3.5 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ జలాశయంలో శనివారం సాయంత్రం వరకు 0.3 టీఎంసీల నీరు చేరుకున్నదని ఈఎన్సీ హరిరాం తెలిపారు. నీటి నిల్వ 0.8 టీఎంసీలకు చేరితే.. అన్నపూర్ణ జలాశయం నుంచి రంగనాయకసాగర్‌కు జలాలను ఎత్తిపోసేందుకు సాంకేతికంగా వీలవుతుందని అధికారులు తెలిపారు.

**లక్ష్మి బరాజ్‌లో 3.571 టీఎంసీలు**

**మహదేవపూర్:** జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మి బరాజ్‌లో శనివారం 3.571 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. కొన్ని నెలలుగా ఎగువ నుంచి వస్తున్న ప్రాణహిత నదీ జలాలు లక్ష్మి బరాజ్‌లో చేరుతున్నాయి. లక్ష్మి పంప్‌హౌజ్ నుంచి సరస్వతి బరాజ్‌కు నీటిని తరలిస్తున్నారు.



జింక కళేబరాన్ని పూడ్చిపెడుతున్న దృశ్యం

# రోడ్డు ప్రమాదంలో జింక మృతి

**కొండాపూర్:** రోడ్డు ప్రమాదంలో జింక మృత్యువాతపడింది. శనివారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం సీహెచ్ కోనాపూర్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జింక గాయపడింది. సర్పంచ్ మాణయ్య ఆ జింకను చికిత్స నిమిత్తం పశువుల దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందింది. అటవీ అధికారులు జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించగా, సీహెచ్ కోనాపూర్ శివారులో ఖననం చేశారు.

## బాలికపై లైంగిక దాడి!

**వరంగల్ క్రైం:** స్నేహం పేరిట ఓ బాలికకు దగ్గరైన ఓ యువకుడు నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన ఘటన వరంగల్ అర్బన్ జిల్లాలో శనివారం వెలుగులోకి వచ్చింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం కొండాపూర్‌కు చెందిన ఓ యువకుడు ఆటో నడుపుతూ హన్మకొండలో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఓ బాలికతో పరిచయం పెంచుకున్న యువకుడు మూడురోజుల క్రితం ఆమెను ఆటోలో తీసుకెళ్లాడు. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు హన్మకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం బాలిక ఇంటికి రాగా పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకొన్నట్టు సమాచారం.

# 'బెస్ట్' దరఖాస్తులకు 20 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఔత్సాహిక బ్రాహ్మణ పారిశ్రామికవేత్తలకు ఆర్థికసాయం అందించేందుకు ప్రవేశపెట్టిన బెస్ట్ పథకానికి దరఖాస్తుల గడువును ఈ నెల 20 వరకు పొడగించారు. వివేకానంద విదేశీవిద్య, రామానుజ ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలకూ అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు శనివారం ఓ ప్రకటనలో కోరారు. పూర్తివివరాలకు brahminparishad.telangana.gov.in వెబ్‌సైట్ పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్ ఓ ప్రకటనలో కోరారు.

# పొన్నాల సోదరుడి భూదందా

- హౌసింగ్‌సొసైటీ ప్లాట్లపై పొన్నాల రాంమోహన్ కన్ను
- న్యాయం చేయాలని సీనియర్ సిటిజన్ల విజ్ఞప్తి



మీడియాతో మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్లు

**నయీంనగర్:** మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య సోదరుడు పొన్నాల రాంమోహన్ టీచర్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన లేఅవుట్‌లోని తమ ప్లాట్లను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని సీనియర్ సిటిజన్లు ఆరోపించారు. హన్మకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో గోడు వెళ్లబోసుకున్నారు. వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని శాయంపేట జాగీర్ గ్రామంలో డీపీ నం.20/92, రివైజ్డ్ 31/93లో 29 మంది ప్లాట్లను కొనుగోలు చేశామని, అందులో షెడ్లు, ప్రహరీలు కట్టుకుని ఇంటి నంబర్లను సైతం తీసుకున్నామని చెప్పారు. 30 ఏండ్ల నుంచి ఆ ప్లాట్లు తమ స్వాధీనంలో ఉన్నాయన్నారు. 2013లో తమ ప్లాట్లపై కన్నేసిన రాంమోహన్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల సహకారంతో ప్లాట్లను వ్యవసాయ భూమిగా తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. చింతల నర్సయ్య మనుమడు చింతల శ్రీనివాస్ పేరిట హన్మకొండ రెవెన్యూ అధికారుల సహకారంతో పాస్‌పుస్తకం తీసుకున్నట్టు చెప్పారు. ఇటీవల రాంమోహన్ తమ ప్లాట్ల వద్దకు వచ్చి షెడ్లను, ప్రహరీలను కూలగొట్టాడని వాపోయారు. దీనిపై సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని సీనియర్ సిటిజన్లు రాజలింగం, మధు, లక్ష్మారెడ్డి, మాధవి, రాధ, యశోద, రాజ్యలక్ష్మి, పద్మావతి, వినయ్, శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.



సింగూరు డ్యాం (ఫైల్)

# మల్లన్న నుంచే మంజీరకు జీవం

- డిజైన్ ప్రకారమే సింగూరుకు కాళేశ్వరం జలాలు
- హల్దీవాగు ద్వారా నిజాంసాగర్‌కు తరలింపు
- ముమ్మరంగా ప్యాకేజీ 17-19 పనులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మల్లన్నసాగర్ జలాలతోనే మంజీర పరిధిలోని రెండు ప్రాజెక్టులకు పునర్జీవం కల్పించనున్నారు. డిజైన్‌ప్రకారం.. మంజీరపై ఉన్న సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులకు మల్లన్నసాగర్ జలాశయం నుంచి కాళేశ్వరజలాలు అందించాలని అలైన్‌మెంట్ రూపొందించారు. ఈ అలైన్‌మెంట్‌లో కొన్ని సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో కొండపోచమ్మసాగర్ ద్వారా అందించాలనే కొత్త ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీనిపై కూడా అధ్యయనం చేయించిన ప్రభుత్వం.. పాత డిజైన్ ప్రకారమే సింగూరు, నిజాంసాగర్‌కు గోదావరి జలాలను తరలించాలని నిర్ణయించింది. శ్రీరాంసాగర్‌కు పునర్జీవం కల్పించిన విధంగానే.. ఎగువ నుంచి వరదలేక తరుచూ వెలవెలబోతున్న సింగూరు, నిజాంసాగర్ జలాశయాలకు పునర్జీవం తీసుకురావాలని సీఎం కేసీఆర్ రీడిజైనింగ్ రూపొందించారు. ఎస్సారార్ నుంచి అన్నపూర్ణ, రంగనాయకసాగర్ ద్వారా మల్లన్నసాగర్‌కు చేరిన కాళేశ్వరజలాలు మూడుమార్గాల్లో బయటకు తరలనున్నాయి. ఒకవైపు కొండపోచమ్మసాగర్.. అదేమార్గంలో మరోవైపు గంధమల్ల రిజర్వాయర్‌కు తరలేలా కాల్వను నిర్మించారు. మల్లన్నసాగర్ నుంచి 158.418 కిలోమీటర్ల మేర జలాలను తరలించి సింగూరులో పోయనున్నారు. ఇందులో 136.2 కిలోమీటర్ల పొడవునా గ్రావిటీకాల్వ ఉండగా.. 22.218 కిలోమీటర్ల సొరంగ మార్గం నిర్మాణం ఉన్నది. సింగూరు సమీపం వరకు గ్రావిటీ ద్వారా చేరుకున్న జలాలను సుమారు 32 మీటర్ల మేర ఎత్తి జలాశయంలో పోయాల్సి ఉంటుంది. ఈ అలైన్‌మెంట్‌లో భాగంగానే నిజాంసాగర్‌కు కూడా జలాలను తరలించేలా డిజైన్ రూపొందించారు. సింగూరు వైపుకు తరలించే క్రమంలో మధ్యలోని హల్దీవాగులో జలాలను పోయడంతో అవి సహజసిద్ధమైన మార్గంలో నేరుగా నిజాంసాగర్ చేరుకుంటాయి.

**సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో..**

మల్లన్నసాగర్ నుంచి గ్రావిటీకాల్వ తర్వాత నిర్మించాల్సిన సొరంగమార్గంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురుకావచ్చనే అభిప్రాయాలు గతంలో తెరపైకి వచ్చాయి. తొమ్మిది మీటర్ల డయాతో నిర్మిస్తున్న ఈ సొరంగమార్గంలో ఐదారు కిలోమీటర్ల మేర మెత్తటి మట్టిపొర వస్తుందనేది ప్రాథమిక సర్వే నివేదించింది. దీంతో సింగూరుకు కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి జలాలను తరలిస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదన వచ్చింది. అయితే ఇది వ్యయప్రయాసలతో కూడుకున్నదిగా ప్రభుత్వ అధ్యయనంలో తేలినట్టు సమాచారం. మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మకు జలాలను 105 మీటర్ల మేర లిఫ్ట్ చేయాల్సి ఉంటుంది. వాటిని అక్కడి నుంచి సింగూరు వైపునకు తరలించాలంటే సుదీర్ఘ కాల్వల నిర్మాణంతోపాటు, ఈ అలైన్‌మెంట్‌లో పారిశ్రామికప్రాంతాలు, గీతం యూనివర్సిటీ, పరిశ్రమలు తదితర వాణిజ్య, నివాసప్రాంతాలు ఉన్న ట్టు తేలింది. దీంతో సమగ్ర పరిశీలన చేసిన ప్రభుత్వం.. మల్లన్నసాగర్ నుంచి తరలింపులో వచ్చే సాంకేతిక సవాల్‌ను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిజం (ఎన్‌ఐఆర్‌ఎం) సహకారంతో అధిగమించవచ్చనే నిర్ణయానికి వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పాత అలైన్‌మెంట్ ప్రకారం చేపడుతున్న ప్యాకేజీ- 17, 18, 19 పనుల్లో వేగాన్ని పెంచారు.

# భూగర్భంలో జలభాండాగారం

## కాళేశ్వర జలాలతో గణనీయంగా పెరిగిన భూగర్భ జలమట్టం

### ప్రాజెక్టు పరిధిలోని ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పు నమోదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒక ప్రాజెక్టు.. దశాబ్దాల తరబడి ఆకాశంవైపు చకోరపక్షిలా ఎదురుచూసిన రైతన్న కండ్లను తడిపింది. ఒక ప్రాజెక్టు.. దశాబ్దాల తరబడి తుమ్మలు మొలిచిన కాల్వలను సజీవ జలచర సంచయ జలాశయంగా మార్చివేసింది. ఒక ప్రాజెక్టు.. ఏండ్ల తరబడి పడావుపడ్డ భూములను మాగాణం చేసింది. ఒక ప్రాజెక్టు.. భూగర్భంలో వేల అడుగుల లోతుల్లో దాగి ఉన్న పాతాళ గంగమ్మను ఉబికుబికి పైకి వచ్చేలా చేసింది. అదే కాళేశ్వరం. ఆసియాలోనే అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకం. కేవలం మూడేండ్ల వ్యవధిలో పూర్తయిన కాళేశ్వరం ప్రాజెక్టు ఫలాలు ఒక్కటొక్కటిగా తెలంగాణ సమాజానికి అందుతున్నాయి. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఎస్సారెస్పీ పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందింది. 150 రోజులకుపైగా కాకతీయ కాల్వలో గోదావరి జలాల ప్రవాహం కొనసాగుతూనే ఉన్నది. దశాబ్దాల మొండి కాల్వలకు జలకళ రాగా.. అసలు నీళ్లొస్తాయా అనుకొన్న చెరువులు మత్తడి దుంకుతున్నయి. తాజాగా భూఉపరితలాన గోదారమ్మ పరవళ్లే కాదు, భూగర్భంలోనూ.. కాళేశ్వరం జల భాండాగారాన్ని తయారుచేసింది. ఇది సాంకేతికంగా రుజువైన వాస్తవం. భూగర్భ జల వనరులశాఖ నివేదికలే ఇందుకు అద్దంపడుతున్నాయి. ముఖ్యంగా నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల పరిధిలో భూగర్భజలమట్టం గణనీయంగా పెరిగినట్టు అధికారులు గుర్తించారు. కాళేశ్వరం జలాలు అందుబాటులోకి రాని సిద్దిపేటలో అధికభాగం పదినుంచి 20 మీట ర్ల లోతులో నీళ్లుండగా.. మిగతా ప్రాంతాల్లో 20 మీటర్ల లోతున నీళ్లు ఉన్నాయి. మెదక్, సంగారెడ్డిలోనూ అధిక భాగం 20మీటర్లలో తున భూగర్భజలాలు ఉన్నాయి. కాళేశ్వరం నాలుగో దశ లింకులో భాగంగా ఇటీవల అన్నపూర్ణ జలాశయానికి నీటి విడుదలచేశారు. నెలాఖరువరకు కొండపోచమ్మలో గోదారమ్మ కొలువుదీరనున్నది. దీంతో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డిలోనూ.. భూగర్భజలమట్టం పెరుగుతుంది. కాళేశ్వరజలాలు విస్తరించేకొద్దీ ఆయా ప్రాంతాల్లోనూ భూగర్భ జలాలు గణనీయం గా పెరుగుతాయని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతుంది. కాళేశ్వరం జలాల విస్తరణ గతేడాది అక్టోబర్ నుంచి మొదలైందని, ఈ సర్వే నవంబర్‌లో నిర్వహించామని భూగర్భ జలవనరులశాఖ డైరెక్టర్ మధునూరె తెలిపారు.

**విప్లవాత్మక మార్పు**

2018, 2019 నవంబర్ మాసాల్లో నమోదైన భూగర్భజలాల స్థాయి కూడా ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నది. 2018కంటే 2019లో కాళేశ్వరం పరిధిలోని ప్రాంతాలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ వర్షపాతం ఎక్కువగా నమోదైంది. సాగుకు బోర్లు, బావుల ద్వారానే కాకుండా రోజువారీ అవసరాలకు కూడా ప్రజలు భూగర్భజలాలను భారీఎత్తున వినియోగించుకొంటున్నారు. కాళేశ్వరం పరిధిలోని ప్రాంతాల్లో 2018 వర్షాకాలానికి ముందు మొత్తం విస్తీర్ణంలో 4శాతం ప్రాంతంలోనే పది మీటర్లలోపున భూగర్భజలాలు ఉన్నాయి. వర్షాకాలం తర్వాత నవంబరులో సర్వే చేయగా... అది 14 శాతానికి పెరిగింది. 2019లో వర్షాకాలానికి ముందు 3 శాతం ప్రాంతంలోనే పదిమీటర్ల లోపున జలాలు ఉండగా.. నవంబర్‌లో కాళేశ్వరం జలాల విడుదల తర్వాత అది ఏకంగా 51 శాతానికి పెరగడమనేది విప్లవాత్మక మార్పుగా అధికారులు అభివర్ణిస్తున్నారు.

**వర్షాకాలం ముందు, తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతంలో భూగర్భ జలాలు పది మీటర్లలోపు అందుబాటులో ఉన్న భూభాగం**

| సీజన్ | భూగర్భ జలమట్టం | |
|---|---|---|
| | 2018 | 2019 |
| వర్షాకాలం ముందు | 4% | 3% |
| నవంబర్‌లో... | 14% | 51% |

# నేడు కొన్నిచోట్ల వడగండ్ల వాన

- స్థిరంగా ఉపరితల ద్రోణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉత్తర ఛత్తీస్‌గఢ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నుంచి మరాఠ్వాడా వరకు విదర్భ మీదుగా సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి కొనసాగుతున్నది. దీని ప్రభావంతో శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్, లోకేశ్వరం, సారంగపూర్, ముథోల్, ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్, నిజామాబాద్ జిల్లా నందిపేట, కామారెడ్డి జిల్లా బీర్కూర్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో క్యుములోనింబస్ మేఘాలు ఆవరించి ఉన్నాయి. ఆదివారం కొన్నిచోట్ల వడగండ్ల వానలు కురిసే అవకాశమున్నదని, సోమ, మంగళవారాల్లో పొడివాతావరణం ఉంటుందని వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. అబ్జర్వేటరీలు లేని ప్రాంతాల్లో ఎక్కడైనా ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వానలు కురిస్తే తమ దృష్టికి తీసుకురావాలని మీడియాను కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

**కామారెడ్డి రూరల్ :** కామారెడ్డి మండలం క్యాసంపల్లి శివారులో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన రాహుల్(20), కోటగిరి మండలం పొతంగల్ వాసి రమణ శేషు(19) వరుసకు అన్నదమ్ములు. హైదరాబాద్‌లోని ఓ కాల్‌సెంటర్‌లో పనిచేస్తున్న వీరు గురువారం సాయంత్రం తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రం రమణ బాల్కొండకు వచ్చాడు. ఇద్దరు రాత్రి అక్కడే బసచేసి శనివారం తెల్లవారుజామున బాల్కొండ నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరారు. క్యాసంపల్లి శివారులోని జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు.

## తల్లిని కలిసిన మారుతీరావు కూతురు అమృత

**మిర్యాలగూడ టౌన్:** ప్రణయ్ హత్య కేసులో నిందితుడైన మారుతీరావు కుమార్తె అమృత శనివారం సాయంత్రం తల్లిని కలిసింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం రెడ్డికాలనీలోని మారుతీరావు నివాసానికి పోలీసుల రక్షణతో వెళ్లింది. పోలీసులు.. వారి బంధువులు, కుటుంబ సభ్యులను రెండో అంతస్తులోకి పంపించగా, మొదటి అంతస్తులోని గదిలో ఉన్న తల్లి గిరిజతో అమృత గంటకుపైగా ఏకాంతంగా మాట్లాడినట్టు తెలిసింది. పోలీసులు ఎవరినీ అనుమతించకపోగా, తండ్రి మరణం తర్వాత అమృత ఇంటికొచ్చి తల్లిని కలవడం చర్చనీయాంశంగా మారింది.

## నిపుణ

IIT DELHI

### డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో

- **పోస్టు:** ట్రెయినీ (డ్రెడ్జింగ్)
- **మొత్తం ఖాళీలు:** 9
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఎంటెక్, అనుభవం.
- **వయస్సు:** 35 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక విధానం:** మెరిట్ ఆధారంగా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 23
- **వెబ్‌సైట్:** http://dredge-india.nic.in

### జేఆర్‌ఎఫ్

జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్)

- **మొత్తం ఖాళీలు:** 30
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ద్వారా
- **పరీక్షతేదీ:** మే 3
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో మార్చి 16 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** ఏప్రిల్ 3
- **వెబ్‌సైట్:** http://www.igcar.gov.in

## విద్య ఉద్యోగ సమాచారం

### ఐఐటీల్లో బీఆర్క్

- **పరీక్షపేరు:** ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టు (ఏఏటీ)
- **ఆఫర్ చేస్తున్న ఐఐటీలు:** ఐఐటీ (బీహెచ్‌యూ) వారణాసి, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ రూర్కీ.
- **అర్హతలు:** ఐఐటీలో ప్రవేశాలకు ఉండాల్సిన అర్హతలతోపాటు జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించాలి.
- **ఏఏటీ నిర్వహణ:** ఐఐటీ ఢిల్లీ
- **పరీక్ష విధానం:** ఒక్క పేపర్ ఉంటుంది. దీనికి మూడుగంటల కాలవ్యవధి.
- **పరీక్ష కేంద్రాలు:** దేశంలోని ఏడు జోనల్ ఐఐటీల్లో నిర్వహిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో జూన్ 8, 9
- **ఏఏటీ పరీక్ష తేదీ:** జూన్ 12 (ఉదయం 9 నుంచి 12 వరకు)
- **ఫలితాల వెల్లడి:** జూన్ 16
- **వెబ్‌సైట్:** https://jeeadv.ac.in

### సీసీఐఎల్‌లో

- **మొత్తం ఖాళీలు:** 10
- **పోస్టులు:** అడిషనల్ జనరల్ మేనేజర్, మేనేజర్, డిప్యూటీ మేనేజర్, అకౌంట్స్ ఆఫీసర్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీఏ/ పీజీ డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణత, అనుభవం
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో, **చివరితేదీ:** ఏప్రిల్ 7
- **వెబ్‌సైట్:** https://www.cciltd.in

### సీఐఎంఎఫ్‌ఆర్‌లో

- **పోస్టు:** సీనియర్ సైంటిస్ట్
- **పేస్కేల్:** రూ.78,800-2,09,200/-
- **మొత్తం ఖాళీలు:** 9
- **విభాగాలవారీగా ఖాళీలు:** మైనింగ్ ఇంజినీరింగ్-1, కెమిస్ట్రీ-4, జియాలజీ-3, జియోఫిజిక్స్-1 ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 9
- **వెబ్‌సైట్:** www.cimfr.nic.in

# మినీ ఐపీఎల్!

## ఇది ఒక ఆప్షన్ మాత్రమే: బీసీసీఐ.. లీగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందో చెప్పలేమన్న దాదా

### ఎటూ తేల్చని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్

ప్రాణాంతక మహమ్మారి కరోనా వైరస్.. కరాళ నృత్యం చేస్తుండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా.. మైదానాలకు తాళాలు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం.. క్రీడలకు నో అంటుంటే.. రాష్ట్ర ప్రభుత్వాలేమో జనం ఒక్కచోట చేరడం మంచిది కాదంటున్నది. కొవిడ్-19 వైరస్ ప్రభావంతో ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అనేక క్రీడా టోర్నీలు అర్థాంతరంగా ఆగిపోగా.. తాజాగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కూడా ఈ సీజన్ ప్రారంభంపై స్పష్టతనివ్వలేకపోయింది. ప్రజారోగ్యమే తమ ప్రథమ ప్రాధాన్యమంటున్న బీసీసీఐ.. ఐపీఎల్‌ను వాయిదా వేయడంతో పాటు దేశవాళీ టోర్నీలన్నింటినీ రద్దు చేసింది. మరో అడుగు ముందుకేసిన ఫిఫా వచ్చే నెలలోనూ ఎలాంటి పోటీలు నిర్వహించకూడదని తీర్మానించింది. రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే ఆసీస్, కివీస్ వన్డే సిరీస్ రద్దుకాగా, ఫెర్గూసన్ కరోనా పరీక్షలో నెగెటివ్‌గా తేలాడు.

మైదానాల్లోకి అభిమానులను అనుమతించకుండా మ్యాచ్‌లు నిర్వహించాలా..! వారాంతాల్లో రెండేసి మ్యాచ్‌లు పెట్టి టోర్నీ ముగించాలా..! అసలు టోర్నీ మొత్తాన్ని కుదించి మినీ ఐపీఎల్ నిర్వహించాలా..! ఇలా అనేక అంశాలపై చర్చించిన బీసీసీఐ పాలక మండలి సమావేశం చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. వైరస్ వ్యాప్తి వేగంగా సాగుతున్న సమయంలో ప్రస్తుతానికి ఆటలను పక్కన పెట్టి ప్రజారోగ్యానికే పెద్దపీట వేయాలని అంతా మూకుమ్మడిగా ఓకే చేసేశారు.







### షెడ్యూల్ ప్రకారమే ఒలింపిక్స్

**టోక్యో:** కరోనా వైరస్ అంతకంతకు విస్తరిస్తున్నా..షెడ్యూల్ ప్రకారమే టోక్యో ఒలింపిక్స్ నిర్వహిస్తామని జపాన్ ప్రధాని షింజో అబె స్పష్టం చేశారు. వైరస్ కారణంగా ఓవైపు రోజురోజుకు మృతుల సంఖ్య పెరుగుతున్న వేళ..టోక్యో ఒలింపిక్స్ నిర్వహణపై ఒకింత సందిగ్ధత ఏర్పడింది. అయితే శనివారం మీడియా సమావేశంలో షింజో అబె మాట్లాడుతూ 'కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు అధికారులతో కలిసి మేము నిరంతరం సమీక్షిస్తూనే ఉన్నాం. పరిస్థితులపై ఎప్పటికప్పుడు అంతర్జాతీయ ఒలింపిక్ సమాఖ్య(ఐవోసీ)తో సంప్రదింపులు జరుపుతున్నాం. ఎలాంటి సమస్యలు లేకుండా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే జూలైలో ఒలింపిక్స్ నిర్వహించేందుకు ముందుకు వెళుతున్నాం' అని అన్నారు.



"ప్రస్తుత పరిస్థితుల్లో ఐపీఎల్ నిర్వహణ గురించి స్పష్టంగా చెప్పలేం. కరోనా వైరస్ కారణంగా ప్రారంభ తేదీని ఏప్రిల్ 15కు మార్చాం. అంటే లీగ్ పూర్తి స్థాయిలో జరుగడం కష్టమే. అయితే షెడ్యూల్‌ను కుదించాల్సిన అవసరం ఉంది. అది ఎన్ని మ్యాచ్‌లు, ఎప్పుడు ప్రారంభమవుతుందనే అంశం మాత్రం ఇప్పుడే చెప్పలేం.

- గంగూలీ, బీసీసీఐ అధ్యక్షుడు

**ముంబై:** కొవిడ్-19 ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ సజావుగా సాగే అవకాశాలు కనిపించడం లేదు. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మ్యాచ్‌లు నిర్వహించేందుకు ముందుకు రాకపోవడంతో ముందస్తు షెడ్యూల్ ప్రకారం మార్చి 29న ప్రారంభం కావాల్సిన లీగ్ ఏప్రిల్ 15కు వాయిదా పడిన విషయం తెలిసిందే. తాజాగా బీసీసీఐ, ఐపీఎల్ ఫ్రాంచైజీల యజమానులతో శనివారం జరిగిన గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలోనూ లీగ్ ప్రారంభంపై స్పష్టత కొరవడింది. కరోనా వైరస్ ముప్పు నేపథ్యంలో టోర్నీ నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించినా.. ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మహమ్మారి ప్రబలుతున్న నేపథ్యంలో మినీ ఐపీఎల్ అంశం తెరపైకి వచ్చినా.. అది ఒక అవకాశం మాత్రమే అని బీసీసీఐ తేల్చినట్లు సమాచారం. 'లీగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందనే దానిపై ఇప్పుడే చెప్పలేం. ప్రజల ఆరోగ్యమే మా (బీసీసీఐ, ఐపీఎల్, స్టార్ నెట్‌వర్క్) ప్రథమ ప్రాధాన్యం. ఆర్థిక పరమైన నష్టం గురించి ఆలోచించడం లేదు' అని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ సహయజమాని నెస్ వాడియా పేర్కొన్నారు.

**ఏడింటిపై చర్చ:**

సమావేశంలో మొత్తం ఏడు అంశాలు చర్చకు వచ్చినట్లు ఓ బీసీసీఐ అధికారి తెలిపారు. 'మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించి అందులో అగ్రభాగంలో నిలిచిన నాలుగు జట్లతో ప్లే ఆఫ్స్ నిర్వహించడంపై చర్చ జరిగింది. వారాంతాల్లో రోజు రెండు మ్యాచ్‌లు నిర్వహించాలనే అంశం తెరపైకి వచ్చింది. ఇక మరో ఆప్షన్‌గా ప్రేక్షకులను అనుమతించకుండా.. ప్లేయర్లకు ఇబ్బంది లేకుండా.. పరిమిత మైదానాల్లోనే అన్నీ మ్యాచ్‌లు నిర్వహించాలని కూడా చర్చ సాగింది. తక్కువ వ్యవధిలో 60 మ్యాచ్‌లను ఖాళీ మైదానాల్లో ఆడిస్తే.. ఫ్రాంచైజీ యాజమాన్యాలకు ఎక్కువ నష్టం రాదనే అంశంపై చర్చించాం. అయితే విదేశాల్లో ఐపీఎల్ నిర్వహణ అంశం మాత్రం చర్చకు రాలేదు' అని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కార్యదర్శి జై షాతో పాటు బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్ (కోల్‌కతా నైట్‌రైడర్స్), ఆకాశ్ అంబానీ (ముంబై ఇండియన్స్), పార్థ్ జిందాల్ (ఢిల్లీ క్యాపిటల్స్), నెస్ వాడియా (కింగ్స్ ఎలెవన్ పంజాబ్)తో పాటు మిగిలిన ఫ్రాంచైజీల యజమానులు పాల్గొన్నారు.



"ఆటగాళ్లు, అభిమానులు, యాజమాన్యాలకు సంబంధించిన అనేక అంశాలపై చర్చ జరిగింది. కేంద్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తాం. వైరస్ వ్యాప్తి తగ్గి ఐపీఎల్ కొనసాగాలని కోరుకుంటున్నా. సమావేశం సందర్భంగా మేమంతా పదేపదే చేతులను శానిటైజ్ చేసుకున్నాం.

- షారుఖ్ ఖాన్

"మనం ధైర్యంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముంది. వ్యాధి వచ్చాక ఇబ్బంది పడేకంటే.. రాక ముందే ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం ముఖ్యం. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన సమయమిది.

- విరాట్ కోహ్లీ



## ఆసీస్, కివీస్ సిరీస్ రద్దు

**మెల్‌బోర్న్:** ప్రపంచవ్యాప్తంగా ప్రబలుతున్న మహమ్మారి కరోనా వైరస్ ధాటికి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వన్డే సిరీస్ అర్థాంతరంగా ముగిసింది. ఇరు జట్ల మధ్య శుక్రవారం తొలి వన్డే జరుగగా.. సిరీస్‌లో ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలున్న విషయం తెలిసిందే. కివీస్ గడ్డపై అడుగుపెట్టే వారిని కచ్చితంగా 14 రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని ఆ దేశ ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆంక్షలు మొదలవడానికి ముందే స్వదేశానికి వెళ్లాలని కివీస్ క్రికెటర్లు నిర్ణయించుకున్నారు. 'న్యూజిలాండ్ ప్రభుత్వం విధించిన పర్యాటక ఆంక్షల నేపథ్యంలో కివీస్ జట్టు స్వదేశానికి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకుంది. అందుకు మేం సమ్మతించాం'అని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో వన్డే సిరీస్‌తో పాటు ఇరు జట్ల మధ్య జరుగాల్సిన టీ20 సిరీస్ కూడా రద్దైంది.



### ఫెర్గూసన్‌కు కరోనా నెగిటివ్

ఆసీస్‌తో తొలి వన్డే సందర్భంగా అస్వస్థతకు గురైన న్యూజిలాండ్ పేసర్ ఫెర్గూసన్‌కు కొవిడ్-19 నెగిటివ్ అని తేలింది. శుక్రవారం నుంచి ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్న ఫెర్గూసన్ పరిస్థితి నిలకడగా ఉండటంతో అతడికి న్యూజాలాండ్ వెళ్లేందుకు అనుమతి లభించినట్లైందని కివీస్ క్రికెట్ బోర్డు తెలిపింది.

## ఆగిన ఇరానీ కప్

### దేశవాళీ క్రికెట్ టోర్నీలకు బీసీసీఐ 'నో'

**ముంబై:** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో.. అప్రమత్తమైన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దేశవాళీ టోర్నీలన్నింటినీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రంజీ విజేత, రెస్ట్ ఆఫ్ ఇండియా మధ్య జరుగాల్సిన ఇరానీ కప్‌తో పాటు అన్ని స్థాయిల క్రికెట్ టోర్నీలను ప్రస్తుతానికి రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ కార్యదర్శి జై షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఇరానీ కప్‌తో పాటు విజ్జీ ట్రోఫీ, మహిళల వన్డే నాకౌట్ టోర్నీ, మహిళల వన్డే చాలెంజర్ టోర్నీ, అండర్-19 వన్డే నాకౌట్ టోర్నీ, అండర్-19 టీ20 లీగ్, అండర్-23 నాకౌట్ టోర్నీలు రద్దయ్యాయి.

## ఫుట్‌బాల్ టోర్నీలన్నీ వాయిదా

**పారిస్:** కరోనా వైరస్ ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని మార్చి, ఏప్రిల్‌లో అంతర్జాతీయ టోర్నీలన్నింటినీ వాయిదా వేస్తున్నట్లు ఫిఫా శనివారం ప్రకటించింది. ఆయా క్లబ్‌లు తమ ఆటగాళ్లను ఈ రెండు నెలల పాటు జాతీయ జట్లకు ఆడేందుకు అనుమతించవద్దంటూ ఫిఫా స్పష్టం చేసింది. ఆసియా, దక్షిణఅమెరికాలో వాయిదాపడ్డ 2022 ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ మ్యాచ్‌ల రీషెడ్యూల్‌పై త్వరలోనే నిర్ణయాన్ని ప్రకటిస్తామని పేర్కొంది. మరోవైపు అన్నిస్థాయిల టోర్నీలను ఈనెల 31 వరకు రద్దు చేస్తున్నట్లు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఏఐఎఫ్ఎఫ్) శనివారం స్పష్టం చేసింది.

NEET (MBBS/BDS) JEE (Mains/Adv.) BITSAT EAMCET
590 NEET MARKS 485 223 (117/160)
720 720
శ్రీ చైతన్య MEDICAL IIT ACADEMY

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
40
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

MARUTHI ACADEMY OFFERS
Series of Mining Legislation Classes
First Class is on 22nd March 2020 (Sunday)
Time: 9 AM to 5 PM
Topics : The Mines Act, 1952 & The Mines Rules, 1955
Faculty : Former Officers Of DGMS & PSUs
Limited Seats available. Fee Rs.2500/- Lunch, tea & snacks are provided
Venue : Near Kukatpally Metro Station, lane along to pillar No. 789
Contact for Registration:
9440979758, 8309251286

## చైనీయులు చేయవట్టే

**ఇస్లామాబాద్:** కరోనా వైరస్‌కు కారణమైన చైనీయులపై పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ అక్తర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రస్తుతం ప్రపంచాన్ని మీరంతా ప్రమాదంలోకి నెట్టివేసారంటూ అక్తర్ తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. గత డిసెంబర్‌లో చైనాలోని వుహాన్ నగరంలో మొదలైన కరోనా వైరస్ అంతకంతకు వ్యాప్తిచెందుతూ ప్రపంచాన్ని కుదిపివేస్తున్నది. ఈ నేపథ్యంలో మాట్లాడుతూ 'అసలు మీరు(చైనీయులు) గబ్బిలాలు, పాములు, కప్పలు, కుక్కలు, పిల్లులు ఎందుకు తింటున్నారో నాకు అర్థం కావడం లేదు. వాటి రక్తం, మూత్రంతో మీరు వైరస్‌ను పుట్టించి ప్రపంచాన్ని ఇబ్బందుల్లోకి నెట్టారు. వైరస్‌తో టూరిజం పరిశ్రమ పడిపోవడంతో పాటు ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతింది' అని అక్తర్ అన్నాడు.




## స్నేహిత్‌కు మూడో స్థానం



**మస్కట్:** ఒమన్ ఓపెన్‌లో తెలంగాణ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ ఫిడెల్ ఆర్ స్నేహిత్‌కు మూడో స్థానం దక్కింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో స్నేహిత్ 11-7, 5-11, 8-11, 11-8, 12-14 తేడాతో ప్రపంచ రెండో ర్యాంక్ ప్యాడ్లర్ మానవ్ థక్కర్ చేతిలో పోరాడి ఓడాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లో స్నేహిత్ 11-7, 5-11, 8-11, 11-8, 12-14తో హజిన్ జెరెమీ(కెనడా)పై అద్భుత విజయం సాధించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో జీత్‌చంద్ర 11-6, 11-7, 13-11తో థక్కర్‌పై గెలిచి టైటిల్ కైవసం చేసుకున్నాడు.




ఐఎస్‌ఎల్‌లో కోల్‌కతా హ్యాట్రిక్ కొట్టింది. శనివారం జరిగిన ఆరో సీజన్ ఫైనల్లో 3-1తో చెన్నైయిన్ ఎఫ్‌సీని చిత్తుచేసి మూడోసారి ట్రోఫీని ముద్దాడింది




E-book today at www.marutisuzuki.com or visit your nearest Maruti Suzuki dealership | Maruti Suzuki vehicles now available under CSD & CPC* | For bulk order, mail at: nishant.vijayvergia@maruti.co.in

AUTHORISED DEALERS: TELANGANA STATE: VARUN: (NIZAMBAD) CALL: 8462236236, (KARIMNAGAR) CALL: 0878 – 2950555. PAVAN: (NALGONDA) CALL: 8790902131. SRI JAYARAMA: (MEHABURNAGAR) CALL: 8096998841. WIN MOTORS: (WARANGAL) CALL: 0688828002. ADARSHA: (KARIMNAGAR) CALL: 9133308022, (WARANGAL) CALL: 0870- 26553319. E-OUTLETS: ADARSHA: (MANCHERIAL) CALL: 8886006633, (NIRMAL) CALL: 9133307720, (JAGITYAL) CALL: 8886776633, (GODAVARIKHANI) CALL: 8886656633, (ADILABAD) CALL: 7799784536, (JANGAON) CALL: 8886756633, (SIDDIPET) CALL: 9581656633. VARUN: (KAMAREDDY) CALL: 9966111132, (ARMUR) CALL: 9052022990, (KOTTAGUDEM) CALL: 9885260333. PAVAN: (MIRYALAGUDA) CALL: 8790902154, (KODADA) CALL: 8790902135. SRI JAYARAMA: (SHADNAGAR) CALL: 8096998841, (WANAPARTHY) CALL: 8096998841. MITHRA AUTO: (KHAMMAM) CALL: 8886063524. SAI SERVICE: (SANGAREDDY) CALL: 7331168888, (ZAHEERABAD) CALL: 7331168888.

*Offer includes consumer offer, retail support and exchange offer (wherever applicable). Terms and Conditions apply. The terms and conditions are subject to change without any prior notice. All offers are brought to you by Maruti Suzuki dealers only. Offers may vary from variant to variant. All offers shown are valid for limited period & for limited stock only. Accessories and features shown in the pictures may not be a part of the standard equipment and may vary according to the variant. Colors shown may vary from actual body colors due to printing on paper. Images used are for illustration purposes only. Above offers are valid till 31st March 2020.